teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...


తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 276 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 13 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఓయూలో దూరవిద్య కోర్సులకు నోటిఫికేషన్ విడుదల

Osmania University
University with Potential for Excellence (UPE)



## కొత్త 50 నోట్లను జారీ చేయనున్న ఆర్‌బిఐ

చెల్లుబాటులో ఉండనున్న పాత నోట్లు



## నోటాపై ముగిసిన ఈసీ సమావేశం

అభిప్రాయాలకు పార్టీలను కోరిన ఎన్నికల సంఘం





# పంచాయతీ ఎన్నికలకు వేగంగా అడుగులు

## సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలకు "వెంట వెంటనే" సన్నాహాలు

### అధికారులతో ఇటు సర్కార్, అటు ఎన్నికల కమిషన్ సమీక్షలు

### ఓటర్ల జాబితాను సైతం ప్రకటించిన ఈసీ

పంచాయతీ ఎన్నికలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలను వెంట వెంటనే నిర్వహించనుందని సమాచారం. ఎన్నికలకు సన్నద్ధతపై ఇటు ప్రభుత్వం, అటు ఎన్నికల కమిషన్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాను సైతం ఈసీ ఇటీవలే ప్రకటించింది. ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్స్ పెట్టే అవకాశం ఉంది.

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పంచాయతీ ఎన్నికలపై సీఎస్ శాంతి కుమారి, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై క్లారిటీ వచ్చిన వెంటనే షెడ్యూల్ రిలీజయ్యే అవకాశం ఉంది. 42% సీట్లు ఇవ్వడానికి సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో పాత పద్ధతినే అమలు చేస్తారని తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు యాభైశాతం ఉండేలా

మిగతా 2 లో



## ఉచిత స్కీమ్‌లపై సుప్రీం కోర్ట్ కీలక కామెంట్స్

ఉచితాలతో పరాన్న జీవులుగా మారుస్తున్నారని ఫైర్

కట్టడికి ఎన్నికల సంఘం, కేంద్రానికి నోటీసులు జారీ



02

## మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు డిమాండ్

పెద్ద ఎత్తున తరలి రావాలని కవిత పిలుపు

ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ కవిత వెల్లడి

02



## మరోసారి కులగణన సర్వే చేపట్టనున్న సర్కార్

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెలంగాణ కులగణన సర్వే నిర్వహించింది. అయితే తొలిసారి నిర్వహించిన సర్వేలో పలు కారణాల వల్ల 3.1 శాతం మంది పాల్గొనలేదు. ఇప్పుడు వారి కోసం మరోసారి కులగణన సర్వే చేపట్టనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. మరోసారి

మిగతా 2 లో





## కాంగ్రెస్ లో తీన్మార్ మల్లన్న గందరగోళం

పార్టీకి వ్యతిరేకంగా "ముక్కుసూటి" వాఖ్యలు

హాట్ టాపిక్‌గా మారిన మల్లన్న వాఖ్యలు

02



## నివాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటుకు నిరసన

ప్లకార్డులు ప్రదర్శిస్తూ చిన్నా.. పెద్దా.. నినాదాలు

సెల్ టవర్ ఏర్పాటు పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం

టవర్ ఏర్పాటు చేయద్దంటూ సంతకాల సేకరణ

టవర్ ఏర్పాట్లు ఆపేయాలంటూ అధికారులకు విజ్ఞప్తి

హనుమకొండ, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా హంటర్ రోడ్ సమీపంలోని ఏకాశీల కాలనీలో అక్కడి కాలనివాసులు చిన్నా.. పెద్దా.. మూకుమ్మడిగా ఓ సెల్ టవర్ ఏర్పాటు పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వివరాలు పరిశీలిస్తే బుధవారం ఏకశీల కాలనిలో గల ఇంటి నెంబర్ 1-7-968/2 బాలుర

మిగతా 2 లో

## మీసేవ దరఖాస్తు రసీదు విషయంలో గందరగోళం

### స్పందించిన పౌరసరఫరాల శాఖ

రసీదును ఎక్కడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): మీసేవ దరఖాస్తు రసీదు విషయంలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ స్పందించింది. దరఖాస్తు రసీదును

మీ సేవ
సులభంగా, వేగంగా

మిగతా 2 లో



## అక్రమంగా ఉద్యోగం పొందిన వారికి ఓఎస్డీ పోస్టా..?

గతంలోనూ ప్రో. మల్లారెడ్డి నియామకం చెల్లదని ఫిర్యాదు

కేయూ వీసీ వద్ద విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

05

ప్రో. మల్లారెడ్డిని ఓఎస్డీ పదవీ నుండి తొలగించాలి

## షెడ్యూల్‌కు ముందు ఇంటర్ అడ్మిషన్లు తీసుకోవద్దు

అడ్మిషన్ షెడ్యూల్ ఇంకా జారీ చేయలేదు

ప్రకటన విడుదల చేసిన ఇంటర్మీడియట్ బోర్డు



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ పూర్తికాకముందే, జూనియర్ కాలేజీల్లో అనధికారిక ప్రవేశాలు చేపడుతన్నారన్న వార్తలు వివిధ పత్రికా మాధ్యమాల్లో వస్తున్నాయని, ఇంటర్మీడియట్

మిగతా 2 లో



02

## రాజకీయ రాచరికాన్ని ప్రశ్నించండి

యువత "సర్పంచ్ ఉద్యోగానికి" సిద్ధం అవ్వండి

# కొత్త 50 నోట్లను జారీ చేయనున్న ఆర్‌బిఐ

న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్వరలో గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లో ₹50 డినామినేషన్ నోట్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నోట్ల డిజైన్ మారదు మరియు మహాత్మా గాంధీ (కొత్త) సిరీస్‌లో ఉన్న ₹50 నోట్లకు అన్ని విధాలుగా సమానంగా ఉంటుంది. ఇంకా, రిజర్వ్ బ్యాంక్ గతంలో జారీ చేసిన అన్ని ₹50 నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి.

# నోటాపై ముగిసిన ఈసీ సమావేశం

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటా ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో వివిధ రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం (ఈసీ) నిర్వహించిన సమావేశం ముగిసింది. పంచాయతీ, స్థానిక ఎన్నికల్లో నోటా పై అభిప్రాయం చెప్పాలని పార్టీలను ఈసీ కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాతో ఎన్నికలను నిర్వహించడాన్ని అధికార కాంగ్రెస్ వ్యతిరేకించింది. నోటాతో ఎన్నిక అనేది ఖర్చు ఎక్కువ అని అభిప్రాయపడింది. ఒకవేళ నోటాతో ఎన్నిక నిర్వహించినా సెకండ్ లార్జెస్ట్ పార్టీ గెలిచినట్లుగా ప్రకటించాలని సూచించింది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నోటాతో ఎన్నికలను సమర్థించింది. పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవం చేసేందుకు బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందని ఈసీకి తెలిపింది. కొత్త మండలాల వివరాలను రాజకీయ పార్టీలకు ఇవ్వాలని ఈసీని కోరింది బీఆర్ఎస్. సుప్రీంకోర్టు లో కేసు ఉన్నందున నోటాపై అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని బీజేపీ తెలిపింది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ కు ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అధికారం లేదని అభిప్రాయపడింది. పంచాయతీ ఎన్నికల నిర్ణయం ప్రభుత్వమే తీసుకోవాలని సూచించింది. నోటా తో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పిందని సీపీఎం పార్టీ తెలిపింది. అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే రీ ఎలక్షన్ కరెక్ట్ కాదని అభిప్రాయపడింది. ఎన్నిక కండక్ట్ చేయడ ముఖ్యమని నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చాయనేది తర్వాత చర్చ అని తెలిపింది. ఇట టీ-టీడీపీ తమ అభిప్రాయాన్ని రెండు మూడు రోజుల్లో చెప్తామని తెలుపగా పోటీలో సింగిల్ క్యాండిడేట్ ఉన్న కూడా నోటా ఉండాలని జనసేన పార్టీ తన అభిప్రాయాన్ని ఈసీకి తెలిపింది.

# ఉచిత స్కీమ్‌లపై సుప్రీం కోర్ట్ కీలక కామెంట్స్



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఏ పల్లెలో చూసిన స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. బీసీ రిజర్వేషన్లు, ఏకగ్రీవాలపై క్లారిటీ రాగానే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న విషయం తెలిసిందే. దీంతో పోటీ చేయాలనుకునే నేతలో ఇప్పటికే తమ ప్రయత్నాలను మొదలు పెట్టారు. ఈ క్రమంలో సుప్రీం కోర్టు ఉచిత పథకాలపై కీలక వ్యాఖ్యలు చేసింది. పట్టణాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని కోరుతూ పలువురు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ పై విచారణలో భాగంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ ఉచిత స్కీమ్ లపై కీలక కామెంట్స్ చేశారు. ప్రజలకు ఉచితంగా రేషన్, డబ్బులు ఇవ్వడంతో వారు పని చేయడానికి ఇష్టపడటం లేదని ఇటువంటి ఉచితాలతో వారిని పరాన్న జీవులుగా మారుస్తున్నారని కోర్టు ఫైర్ అయింది. కాగా గతంలో కూడా ఉచితాలపై సుప్రీం కోర్టు ఫైర్ అయింది. ఎన్నికలకు ముందు ఓటర్లను ప్రలోభ పెడుతూ రాజకీయ పార్టీలు ఇచ్చే వాగ్దానాలు తీవ్రమైన సమస్య అని సుప్రీంకోర్టు కామెంట్ చేసింది. దీన్ని ఎలా కట్టడి చేస్తారో సమాధానం చెప్పాలని ఎన్నికల సంఘం, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఉచిత వాగ్దానాలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్నాయంటూ, దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీజేఐ ఈ కామెంట్స్ చేశారు. ఈ ఇష్యూను చట్టబద్ధంగా ఎలా నియంత్రించాలో తెలుసుకోవాలనుకుంటున్నాను అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ అన్నారు.

# మీసేవ దరఖాస్తు రసీదు విషయంలో గందరగోళం

మొదటి పేజీ తరువాయి

ఎక్కడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. మీసేవలో దరఖాస్తు చేసిన రసీదును భద్రపరుచుకోవాలని సూచించింది. రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ నిరంతరం ఉంటుందని తెలిపింది. రేషన్ కార్డు కోసం అప్లికేషన్ల కు నిర్దేశిత గడువు ఏమీ లేదని దరఖాస్తు దారులు తొందర పడాల్సిన అవసరం లేదని తెలిపింది. కులగణన, ప్రజాపాలన, ప్రజావాణిలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ అప్లై చేయాల్సిన అవసరం లేదని తెలిపింది. అయితే మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ వాటికి సంబంధించిన రశీదును పౌరసరఫరాల శాఖ కార్యాలయం లేదా తహశీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని మీ సేవ నిర్వాహకులు సూచిస్తున్నారు. దీంతో అప్లికేషన్ రశీదులను పట్టుకుని సివిల్ సప్లయ్ కార్యాలయాలకు ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఆన్‌లైన్‌లో అప్లయ్ చేశాక మళ్లీ ఫిజికల్‌గా రశీదులు ఇవ్వడం ఏంటని ప్రజలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు క్లారిటీ ఇచ్చారు.


# షెడ్యూల్‌కు ముందు ఇంటర్ అడ్మిషన్లు తీసుకోవద్దు

మొదటి పేజీ తరువాయి

బోర్డు పై, అడ్మిషన్ ప్రక్రియలో పీఆర్ఓలపై వార్తలు వస్తున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ బోర్డు వాస్తవాలను వెల్లడించింది. రాబోయే విద్యా ఏడాదికి సంబంధించి 2025-2026 కోసం అనుబంధ నోటిఫికేషన్ అడ్మిషన్ షెడ్యూల్‌ను ఇంకా జారీ చేయలేదని ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 2025-26 విద్యా సంవత్సరానికి గాను, అడ్మిషన్ షెడ్యూల్‌కు ముందు జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోవద్దని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తున్నామన్నారు. 2025-2026 విద్యా సంవత్సరానికి తాత్కాలిక అనుబంధ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. అనుబంధ నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత, తాత్కాలికంగా అనుబంధ జూనియర్ కళాశాలల జాబితాను ఇంటర్మీడియట్ బోర్డు వెబ్ సైట్ tgbie.cgg.gov.in , acadtgbie.cgg.gov.in లలో ప్రదర్శిస్తామని వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అనుబంధ జూనియర్ కళాశాలల్లో మాత్రమే చేర్చుకోవాలని సూచించింది. ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించే అడ్మిషన్ షెడ్యూల్ ప్రకారం అడ్మిషన్లు ఖచ్చితంగా నిర్వహించాలని ప్రైవేట్ జూనియర్ కళాశాలల అన్ని యాజమాన్యాలకు తెలియజేస్తున్నామన్నారు. ఈ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయాని హెచ్చరించింది. నిబంధనలు అతిక్రమిస్తే 2025-26 విద్యా సంవత్సరానికి తాత్కాలిక అనుబంధ గుర్తింపు ప్రక్రియను చేపట్టబోమని వెల్లడించింది. జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారులు బోర్డు ఆదేశాలను పాటించాలని కోరింది.

# రాజకీయ రాచరికాన్ని ప్రశ్నించండి

## యువత సర్పంచ్ ఉద్యోగానికి సిద్ధం అవ్వండి



గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ ఉద్యోగానికి గ్రామం మొత్తంలో కేవలం ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే దరఖాస్తు చేసుకుంటున్నారు. వార్డు సభ్యులుగా కూడా కేవలం ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే దరఖాస్తు చేసుకుంటున్నారు. వీళ్లేనా అర్హులు..?. ఒక్కసారి ఆలోచించండి. వీళ్ళందరూ రాజకీయ పార్టీలు పెట్టిన లేదా నిర్ణయించిన దరఖాస్తుదారులే. అవునా.. కాదా.. ఈ విధంగా వచ్చిన అభ్యర్థులు ప్రజల ఓట్లను డబ్బుతో, మద్యంతో కొనుక్కొని సర్పంచ్ ఉద్యోగాన్ని చేజిక్కించుకుంటున్నారు. ఇలా ఉద్యోగాన్ని కొనుక్కునేవాడు లంచాలు తీసుకుంటూ గ్రామాభివృద్ధి మరచి, అక్రమ సంపాదనే లక్ష్యంగా ముందుకు సాగుతూ.. ఊరు మీద తన పెత్తనం చేలాయిస్తూ.. పేదవర్గాల ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తారు. ఇది రాజకీయ రాచరికానికి నిదర్శనంగా దర్శనం ఇస్తున్నాయి. ఇదీ మన దేశంలో ఉన్న గ్రామ పంచాయతీ రాజకీయ నాయకుల దుర్మార్గపు వ్యవస్థ. అర్హత ఉండి, చదువుకొని జ్ఞానవంతులై ఉండి కూడా ఊరికి అన్యాయం జరుగుతుంటే ప్రత్యక్షంగా చూస్తూ కూడా యువకులు, జ్ఞానవంతులు ఈ సర్పంచ్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవడం లేదు.



అచ్చునూరి కిషన్ ముదిరాజ్
ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ములుగు జిల్లా ఇంచార్జీ.
సెల్ నెంబర్ : 9000986761


**యువత ముందుకు రాకపోవడానికి కారణం ఏంటి..?**

- రాజకీయాలు తెలియకా..?
- డబ్బు లేకపోవడమా..?
- తెలివితేటలు లేకపోవడమా..?
- ప్రజలను పరిపాలించే సత్తా, దమ్ము లేకపోవడమా..?

ప్రజలకు నీతివంతమైన పరిపాలన అందించే సత్తా ధైర్యము ఉంటే..? సర్పంచి ఉద్యోగానికి ప్రతి గ్రామంలో పోటీ చేయండి. ఓడినా పర్వాలేదు మరోసారి గెలుస్తావు. ఛలో ఆలోచించి అడుగు ముందుకు వేయండి.! ఆలస్యం చేయకండి..!! డిగ్రీలు, పిజిలు, పోటీ పరీక్షలు రాయటానికి 10, 15, 20 సంవత్సరాలు దీక్షగా కూర్చొని పోటీపడ్డవాళ్ళు కేవలం ఒక్క గ్రామంలో 1000 నుండి 1500 ఓట్లు ఉన్న గ్రామంలో 750 ఓట్లకు పరీక్షలు రాయండి. కచ్చితంగా సర్పంచి ఉద్యోగం మనదే. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు యువత మేల్కొవాలి. వార్డు సభ్యుల నుండి సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటిసి, కౌన్సిలర్, కార్పొరేటర్ ఉద్యోగాలు కైవసం చేసుకోవాలి.

# పంచాయతీ ఎన్నికలకు వేగంగా అడుగులు

మొదటి పేజీ తరువాయి




ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అంతకన్నా ఎక్కువ సీట్లు కేటాయించాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఉభయ సభలను సమావేశపర్చి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ తరుణంలో అది సాధ్యం కాదని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఒక అడుగు ముందుకు వేసింది. తమ పార్టీ 42% సీట్లను బీసీలకు కేటాయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ ఇటీవలే రైతు భరోసా మొత్తాన్ని కర్షకుల ఖాతాల్లో జమ చేసింది. బీసీ కులగణన చేపట్టి 56 శాతం వెనుకబడిన వర్గాల వారున్నారని తేల్చింది. వారికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకులున్న దృష్ట్యా పార్టీగా ప్రకటిస్తామని వివరించింది. ముందుగా పార్టీ గుర్తుతో సంబంధం లేకుండా జరిగే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఏక గ్రీవాలు అధికంగా చేయడం ద్వారా మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకోవాలని భావించింది. ఈసీ నోటా అంశాన్ని తెరమీదకు తేవడంతో కొంత ఇబ్బంది పడ్డ కాంగ్రెస్.. ఇవాళ నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ లో ఒకే అభ్యర్థి బరిలో ఉంటే నోటాతో పోటీ పెట్టే అంశాన్ని వ్యతిరేకించింది. గెలిచిన సర్పంచులు.. అభివృద్ధి కోసం తమ పార్టీలో చేరుతారని భావిస్తోంది. వారిని చేర్చుకొని వాళ్ల అండతో ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమయ్యే అవకాశ ఉంది. ఇలా చేయడం ద్వారా మెజార్టీ మండలాల్లో పాగా వేయొచ్చన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం బీసీలకు కొంచం తక్కువ 23% సీట్లను కేటాయించనుంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీలకు 28% స్థానాలను కేటాయించే అవకాశం ఉందని సమాచారం. దీనిపై న్యాయ సమీక్ష జరిగిన తర్వాత ఎలాంటి ఆటంకాలు రావని నిర్ధారించుకున్న మీదటే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది.

# ఓయూలో దూరవిద్య కోర్సులకు నోటిఫికేషన్ విడుదల



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్సీడీఈ), వివిధ డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పీజీఆర్ఆర్సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు వివిధ కోర్సులకు ఏటా రెండు దఫాలుగా ప్రవేశాలు నిర్వహిస్తున్నామని.. అందులో భాగంగా రెండో దఫా మార్చి 31వ తేదీ వరకు ప్రవేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. దూరవిద్య కేంద్రం పరిధిలో వివిధ పీజీ, యూజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులతో కలిపి మొత్తం 72 కోర్సులను అందిస్తున్నారు. కోర్సుల వివరాలు, నిబంధనలు, ఫీజు వివరాలు అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు ఆన్లైన్ విధానంలో నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 8886111690, 040-27097177, 040-27098350 నంబర్లలో సంప్రదించవచ్చు.


# మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు డిమాండ్ చేస్తూ మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఇందిరా పార్కు వద్ద మహిళా శంఖారావం ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. జాగృతి సమావేశంలో కవిత మహిళా శంఖారావం పోస్టర్ ను కవిత ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు నిర్వహిస్తున్న మహిళా శంఖారావంకు రాష్ట్రం నలుమూలల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడబిడ్డలు ఒకసారి తమ భవిష్యత్తుపై సింహావలోకనం చేసుకోవాని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చారని, అలాగే మహిళలకు పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేశారన్నారు. ఇవ్వాళ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆడబిడ్డల అభివృద్ధి సంగతేమోగాని భద్రత కూడా కరువైందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన సీసీ కెమెరాల్లో 70శాతం పనిచేయడం లేదన్నారు. ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు 18ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు స్కూటీలు ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ కిట్, గర్భిణీల కోసం అంబులెన్స్ పథకాలు అమలు కావడం లేదని పేద గర్భిణీలకు నెలకు వేయి రూపాయాలు అందించడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అదికూడా ఇవ్వడం లేదని, మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో నమ్మకం పోయిందని ప్రభుత్వం వాటిపై శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకా గాంధీలను తీసుకొచ్చి ఆరు గ్యారంటీల హామీలు ఇప్పించారని, మహిళలకు నెలకు రూ.2,500ఇస్తామని చెప్పి ఇప్పటిదాకా 35వేలు ఒక్కొక్కరికి బాకీ పడ్డారన్నారు. వరంగల్ లో రైతు డిక్లరేషన్ చేసి అమలు చేయనందుకు ప్రజలు ప్రశ్నిస్తారని తెలిసి భయంతో పారిపోయి రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు చేసుకున్నారని ఇదే పద్ధతిలో హామీలు అమలు చేయని కాంగ్రెస్ పాలకులను నిలదీస్తారన్నారు. ఎన్నికల హామీల అమలుపై బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదన్నారు. మహిళలకు రూ.500లకు సిలిండర్, 200యూనిట్లు అందరికి అమలు కావడం లేదన్నారు. బుధవారం 33జిల్లాల నుంచి మహిళా ప్రతినిధులు వచ్చారని మార్చి 8న అసలు సినిమా ఉందన్నారు. రేషన్ కార్డుల దరఖాస్తులు, జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని, ఉచిత బస్సుతో మహిళలకు ఆత్మగౌరవం దెబ్బతీస్తున్నారని, బస్సుల సంఖ్య పెంచి వారి గౌరవం కాపాడాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు సక్రమంగా జీతాలివ్వాలని, బీడీ కార్మికులకు 4వేల హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలపై ఎవరు అడగడం లేదన్న ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. బూటకపు హామీలతో మహిళలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మహిళా శంఖారావంతో జాగృతి పోరాటం ప్రారంభించిందని ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీలపై సమీక్ష చేసి అమలుకు చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

# నివాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటుకు నిరసన

మొదటి పేజీ తరువాయి


Residents of Ekasila Co-op. Housing Society Colony
Hunter Road, Hanamkonda
S.No. Name H.no/Metre Signature

హాస్టల్ పైన సెల్ టవర్ ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో నివాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల కలిగే అనారోగ్య సమస్యల దృశ్యా కాలనీవాసులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ శాంతియుతంగా నిరసన తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏకశీల కాలనీ వాసులందరు హాజరైనారు. కాలనీవాసూలు సెల్ టవర్ ఏర్పాటు చేస్తే ఏ విధంగా రేడియేషయిన్ సమస్యలు వస్తాయనే పలు విషయాలను చర్చించారు. కాలనీ వాసులందరు ముక్త కంఠంతో సెల్ టవర్ ఏర్పాటు చేయకూడదని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లకు సెల్ టవర్ ఏర్పాటు నిలుదలకు విజ్ఞాపనలను ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంపై కాలనీ వాసులు సంతకాల సేకరణ కూడా చేయడం జరిగింది. కాగా ఇట్టి విషయంపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారనేది వేచి చూడాలి.

# మరోసారి కులగణన సర్వే చేపట్టనున్న సర్కార్

మొదటి పేజీ తరువాయి

కులగణన చేపడితే తాము పాల్గొంటామంటూ పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపారు. ఆ విజ్ఞప్తులపై భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ మరోసారి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ఉంటుంది. తొలిసారి చేపట్టిన కులగణన సర్వేలో ఎవరైతే పాల్గొనలేదో వారికి మరోసారి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఫిబ్రవరి ఈ నెల 16 నుంచి 18 మధ్య మరోసారి కులగణన సర్వే నిర్వహిస్తున్నాం. సర్వేలో పాల్గొనే వాళ్ళు టోల్ ఫ్రీ, మండల కేంద్రాలు, ఆన్లైన్ ద్వారా సర్వేలో పాల్గొనవచ్చు. కేసీఆర్, కేటీఆర్ లాంటి వాళ్లకు మరో అవకాశం ఇస్తున్నాం. రాష్ట్ర జనాభాలో వీళ్ళు చేరాలని విజ్ఞప్తి చేస్తున్నాం. మార్చి మొదటి వారంలో కేబినెట్ ఆమోదం తెలుపుతాం. ఎన్నికల వాగ్దానం మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం. రాబోయే అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టం చేస్తాం. అసెంబ్లీలో బిల్లు ఆమోదం తెలిపి కేంద్రానికి పంపుతాం. త్వరలోనే తెలంగాణ నుంచి బృందంగా వెళ్లి ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, పార్లమెంట్ పెద్దలను కలుస్తాం. కేంద్రం వద్దకు వెళ్లినప్పుడు కలిసివచ్చే రాజకీయ పార్టీలను తీసుకెళ్తాం. దశాబ్దాల బీసీ కల త్వరలోనే నెరవేర్చబోతున్నాం. ఓబీసీల లక్ష్యాలను సాధించడానికి సహకరించిన వారికి ధన్యవాదాలు. బీసీ రిజర్వేషన్లు ప్రకటన తర్వాతే పంచాయతీ ఎన్నికలు ఉంటాయి. బీసీ రిజర్వేషన్లు కల్పించడానికి కేంద్రం చట్టబద్ధత కల్పిస్తుందని ఆశిస్తున్నాం. మా పార్టీ ఎంపీలే కాదు అన్ని పార్టీల ఎంపీలను కలుపుకోని వెళ్తాం. అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ లో "తీన్మార్ మల్లన్న" గందరగోళం

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యవహారం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. తరచూ పార్టీకి, ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా మల్లన్న మాట్లాడుతుండడంతో నేతలతోపాటు క్యాడర్‌లోనూ గందరగోళనం నెలకొన్నది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకున్న కుల గణన సర్వేను తగులబెట్టడంపై అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నది. దీంతోనే మల్లన్నపై చర్యలకు సిద్ధమైంది. ఇప్పటికే మల్లన్నకు కాంగ్రెస్‌షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్రమశిక్షణ కమిటీ వివరణ ఇచ్చేందుకు ఆయనకు వారం రోజులు గడువు ఇచ్చింది. ఈనేపథ్యంలో బుధవారం మల్లనన్నను మీడియా ప్రశ్నించగా తాను వివరణ ఎవరికి ఇవ్వాలో?.. వారికే ఇచ్చానని వ్యాఖ్యనించినట్లు తెలిసింది. పీసీసీ నియమించిన క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇవ్వబోనని తీన్మార్ మల్లన్న తేల్చి చెప్పినట్లుగా గాంధీ భవన్‌వర్గాలు చెబుతున్నాయి. కుల గణన సర్వేను తప్పుబడుతూ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, ప్రతులను దగ్ధం చేయడంపై వివరణ ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే మల్లన్న విమర్శలు ప్రజల్లోనూ, ముఖ్యంగా బీసీ వర్గాల్లో సర్వేపై అపోహలను పెంచిందని కాంగ్రెస్‌భావిస్తోంది. అందుకే ఆయనపై చర్యలకు సిద్ధమైనట్లు కాంగ్రెస్‌వర్గీయులు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఆయన తీరుపై కాంగ్రెస్ పెద్దలు సీరియస్గానే ఉన్నారని కొందరు పేర్కొంటున్నారు. కాంగ్రెస్‌పార్టీలో తీన్మార్ మల్లన్నకు షోకజ్ నోటీస్, ఆయన స్పందిస్తున్న విధానంతో రగడ నెలకొంది.

# పెద్దగట్టు జాతరకు పటిష్ఠ భద్రత

**బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ**
**2000 మంది పోలీస్ బందోబస్తుతో పటిష్ఠ భద్రత**
**68 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా**
**దొంగతనాల నివారణకు పోలీస్ స్పెషల్ టీమ్స్**
**మహిళల రక్షణకు షీ టీమ్స్**
**జాతరలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు**
**16 నుండి జాతీయ రహదారి 65 పై వాహనాల మళ్లింపు**
**జాతర నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి**
**సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**



సూర్యాపేట జిల్లా, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర రెండవ అతిపెద్ద జాతర దురాజుపల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఈనెల 16వ తేదీ నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ అదనపు ఎస్పి నాగేశ్వరరావు, సూర్యాపేట సబ్ డివిజన్ డిఎస్పి రవి, స్థానిక సీఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, స్థానిక ఎస్ఐ మహేశ్వర్ లతో కలిసి బుధవారం జాతర ప్రాంగణంలో పోలీసు భద్రత ఏర్పాట్లను, బందోబస్తు ఏర్పాట్లను, జాతర రూట్ మ్యాప్, గ్లోబల్ మ్యాప్ లను పరిశీలించారు.అనంతరం జాతరకు వచ్చే భక్తుల యొక్క వాహనాలు నిలపటానికి ఏర్పాటు చేసిన భారీ పార్కింగ్ ప్రదేశాలను, సిబ్బంది వసతి, జాతరకు వచ్చి పోయే మార్గాలు, జాతర ప్రాంగణంలో బారికెడ్ ల ఏర్పాటు, దేవస్థానం రక్షణను ఎస్పీ పరిశీలించారు. జాతరకు వచ్చిపోయే అన్ని మార్గాలలో భక్తుల వాహనాల వల్ల, భక్తుల రద్దీ వల్ల ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జాతర ప్రారంభమయ్యే 16వ తేదీ నుండి జాతీయ రహదారి 65 పై వాహనాల మళ్లింపులు ఉంటాయని హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్లే వాహనాలను నార్కెట్ పల్లి వద్ద నల్గొండ మీదుగా మిర్యాలగూడ హుజూర్నగర్ కోదాడ వైపు మళ్లించడం చేస్తున్నామని అలాగే విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్లే వాహనాలను కోదాడ వద్ద హుజూర్నగర్ నల్గొండ వైపుగా మళ్లింపు చేస్తున్నామని తెలిపారు. వాహనాల మళ్లింపులు ఉంటాయి కాబట్టి వాహనదారులు ముందుగా గమనించాలని కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతర నిర్వహణకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని, జాతర నిర్వహణకు అన్ని భద్రత చర్యలు తీసుకున్నాం అన్నారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు వస్తారు, జాతరకు 2000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట రక్షణ బందోబస్తు ఏర్పాటు చేశామని, ఇతర జిల్లాల పోలీసు సిబ్బందిని కూడా ఉపయోగిస్తున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులకు దైవదర్శన సౌకర్యం కలిగించడం పోలీసు ముఖ్య విధి అని తెలిపారు. జిల్లా యంత్రాంగం, ఇతర శాఖలతో కలిసి పని చేస్తాము అని తెలిపినారు. జాతర ప్రాంగణంలో 68 సీసీ కెమెరాలతో నిఘా ఉంచామని సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేసి 24 గంటలు నిఘా ఉంచుతామని తెలిపారు. దొంగతనాలు జరగకుండా పోలీస్ స్పెషల్ టీమ్స్, సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బంది, టెక్నికల్ టీమ్స్, క్రైమ్ కంట్రోల్ టీమ్స్ ను ఏర్పాటు చేశాం అన్నారు, ప్రత్యేక టీమ్స్ సిబ్బంది మఫ్టీలో తిరుగుతూ అనుమానితులను, కొత్త వ్యక్తులను గుర్తించి దొంగతనాల నివారణకు కృషి చేస్తారని తెలిపారు. మహిళల భద్రతకు సంభందించి షీ టీమ్స్ సిబ్బంది అందుబాటులో ఉంటారు, షీ టీమ్స్ సాధారణ భక్తుల్లాగా ప్రజల్లో కలిసిపోయి మహిళల పట్ల అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. జాతర ప్రదేశంలో పోలీస్ కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని అత్యవసర సమయంలో పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవడానికి పోలీస్ హెల్ప్ లైన్ సెంటర్లను లేదా అందుబాటులో ఉన్న పోలీసులను సంప్రదించవచ్చని కోరారు. ఎవరైనా తప్పిపోయినట్లయితే కంట్రోల్ రూమ్ ద్వారా సహాయం పొందవచ్చు అని అన్నారు. చెరువు నిండుగా ఉన్నందున చెరువు వైపు ఎవరు వెళ్లకుండా భారికెడ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పిల్లల, వృద్ధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి అన్నారు.ఎస్పీ అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, సూర్యాపేట సబ్ డివిజన్ డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, సీఐ లు శ్రీను, రఘువీర్, వీర రాఘవులు, స్థానిక ఎస్ ఐ మహేశ్వర్,ఎస్ ఐ లు సాయిరామ్, శ్రీకాంత్, బాలు నాయక్, వీరయ్య, సిబ్బంది ఉన్నారు.



# వరంగల్‌లో ఉత్సాహభరితంగా 2కే రన్

**యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు**
**డ్రగ్స్ నిర్మూలనపై టీఎస్‌జెయు పోరాటం అభినందనీయం**
**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): యువత సరదాగా డ్రగ్స్ అలవాటు చేసుకొని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టిఎస్ జెయు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పోచం మైదాన్ చౌరస్తా నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, ఎన్ యు జె (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ లతో కలిసి జెండా ఊపి 2కే రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారికి బానిసలై యువత జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. సరదాగా కిక్ కోసమో, థ్రిల్ కోసమో మొదలయ్యే మత్తు మందుల అలవాట్లు యువత పాలిట శాపాలుగా మారుతున్నాయన్నారు. డ్రగ్స్ విషవలయంలో చిక్కుకుంటున్న యువత భవిష్యత్ సర్వనాశనం అవుతోందన్నారు. డ్రగ్స్ వ్యసనాలను వదులుకోలేని కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిని బయట పడేసేందుకు సామాజిక సంస్థలు తమవంతుగా కృషి చేయాలని సూచించారు. ఇందులో భాగంగా టీఎస్ జెయు చేస్తున్న కృషిని కొనియాడారు. వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి యువత భవితవ్యాన్ని ఛిన్నాభిన్నం చేస్తోందన్నారు. దేశ అభివృద్ధికి తోడ్పడాల్సిన విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటుపడి వారి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని జన్మలకంటే మానవజన్మ ఎత్తడం అదృష్టమన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థానాలకు రావాలని కలలు కనాలి, వాటిని నిజం చేసుకోవడానికి అనునిత్యం కృషి చేయాలన్నారు. కానీ కొందరు డ్రగ్స్ మహమ్మారి ఊబిలో చిక్కుకోవడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ప్రభుత్వం డ్రగ్స్ సరఫరా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటుందని గుర్తు చేశారు. టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి మన రాష్ట్రంతో పాటు ప్రపంచాన్ని గడగడలాడిస్తోందని అన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడి ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల మన మానసికంగా, శారీరకంగా కుంగుబాటుకు లోనవుతామని తెలిపారు. డ్రగ్స్ వల్ల జీవితాలు రోడ్డున పడతాయని అన్నారు.డ్రగ్స్ అలవాటు పడిన వారు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యుల జీవితాలు సైతం రోడ్డు పడతాయన్న విషయం గురించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు జీవితంలో ఎదిగి మంచి కుటుంబంతో సంతోషంగా బతకాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డ్రగ్స్ నిర్మూలన కోసం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోటి మందిని చైతన్యవంతం చేయాలని లక్ష్యంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వరంగల్ ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తామని చెప్పారు. దశలవారీగా అన్ని జిల్లాలలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. టీఎస్ జేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులుగా కేవలం వార్తలు రాసేందుకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతగా ప్రభుత్వానికి మద్దతుగా డ్రగ్స్ వినియోగంపై టిఎస్ జెయు ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం తెస్తున్నామన్నారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వ సంస్థల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మోహన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగపురి నాగరాజు, పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రావుల నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి, ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు, గంగరాజు, లింగబత్తిని కృష్ణ, ఈద శ్రీనాథ్, శ్రీహరి నీరుటి శ్రీహరి, భాగ్యరాజు, కోశాధికారి బత్తుల సత్యం, అవినాష్, అడప అశోక్, మోహన్ రావు, మంతెన సురేష్, బొక్క రాజు పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ ఎన్నికలలో పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్, డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి**



వరంగల్, ఫిబ్రవర రి 12 (తీన్మార్ న్యూస్): వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్, డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి జి. సంధ్యారాణి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్- ఖమ్మం -నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఓ, ఓపిఓ ల శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం జారీ చేసిన పిఓ హ్యాండ్ బుక్ ను సంపూర్ణంగా చదవాలని చెప్పారు. పిఓ, ఓపీవోలు వారికి కేటాయించిన విధుల ప్రకారం పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రదర్శింప చేయడం, అభ్యర్థుల ఏజెంట్ల జాబితా పరిశీలన, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం వంటి అన్ని అంశాల పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంతేకాక బ్యాలెట్ బాక్సులు ముందే తనిఖీ చేసుకోవాలని, పోలింగ్ కు ముందే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ లు తెరిచి చూపించాలని, అప్పుడే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వారికి తెలుస్తుందని అన్నారు. డిక్లరేషన్ అలాగే పోల్ ప్రారంభం వంటి అంశాల పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలో శాంతిభద్రతలు, అలాగే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబడే వారి వివరాలు అన్నింటి పట్ల పిఓ, ఓపిఓ లు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రాధాన్యత క్రమంలో ఓటర్లు ఓటు వేయవలసి ఉంటుందని, ఇందుకు ఎన్నికల కమిషన్ అంగీకరించిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్ మాత్రమే వాడాలని, ఈ విషయం ముందే ఓటర్లకు తెలియజేయాలని చెప్పారు. ఎన్నికలలో ఫారం -16 అత్యంత కీలకమని అన్నారు. బ్యాలెట్ పేపర్ కు సంబంధించి ఎలాంటి పొరపాట్లు లేకుండా తీసుకున్న బ్యాలెట్లు, ఓటింగ్ తర్వాత అప్పజెప్పే బ్యాలెట్ పేపర్ల విషయంలో తేడాలు లేకుండా చూసుకోవాలని, వినియోగించిన బ్యాలెట్లను సైతం సీరియల్ నంబర్ తో సహా వేసుకొని సమర్పించాలన్నారు. ఎన్నికలలో పిఓ డైరీ అత్యంత కీలకమని తెలిపారు. అలాగే స్టాట్యూరీ, నాన్ స్టాట్యూరీ కవర్లు పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఎట్టి పరిస్థితులలో ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పూర్తి జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా పిఓలు ఓపీవోలకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ నిర్వహించి వారిలో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డిఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, ట్రైనింగ్ నోడల్ అధికారి బాలకృష్ణ, సూపరిండెంట్ రంజిత్, ఎన్నికల శిక్షకులు,పిఓలు ఓపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సివిల్ జడ్జ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు



జనగామ జిల్లా, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ సి విక్రమ్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి ,సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీ %జ% విక్రమ్ గారు అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగము కల్పించిన హక్కులను తెలుసుకొని ఉండాలి అన్నారు .సుప్రీంకోర్టు ఆ హక్కులను పరిరక్షిస్తూ ఉంటుంది చదువుకోవటం ఒక హక్కు ,ఎదుగుదల మరియు అన్ని విషయాలలో పాల్గొనటం ఇలాంటివి ప్రతిదీ రాజ్యాంగంలో రాతపూర్వకముగా పొందపరిచారు .మగవారికి వివాహము వయసు 21 సంవత్సరాలు, ఆడవారికి 18 సంవత్సరాలు అని చట్టాలు రూపొందించారు. అలాగే హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి విద్యార్థులకు వివరించారు. బయట తెలియని వ్యక్తులతో ఎక్కువ మాట్లాడరాదు. వారు ఏమి ఇచ్చిన తీసుకోరాదు అన్నారు. ఎక్కువ సమయం విద్య పైనే శ్రద్ధ ఉంచాలి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది అన్నారు. మా సంస్థ ఎప్పుడు పిల్లలకు స్నేహభావంతోటే మెలుగుతుంది అన్నారు. జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ 2024లో చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్స్ అనే స్కీముని ద్వారా పిల్లలకు, విద్యార్థులకు ఫ్రెండ్లీగా ఉండాలని భావనతో ఈ స్కీమును మొదలుపెట్టడం జరిగినది. అలాగే మీ స్కూల్ ఆవరణలో ఒక కంప్లైంట్ బాక్స్ ను పెట్టడం జరుగుతున్నది దాంట్లో మీకేమైనా సమస్యలు ఉంటే ఆ బాక్స్ లో వేయగలరని తెలియజేశారు. చివరగా చదువు ఎంత ముఖ్యమో ఆటలు, వ్యాయామము కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ సి విక్రమ్ తో పాటు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ డి చంద్రమౌళి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఎం రవీంద్ర మరియు స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.


## గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి శిక్షణా

**జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి తెలిపారు. జిల్లాలో రెండవ విడత సాధారణ ఎన్నికలు సర్పంచి మరియు వార్డ్ గ్రామపంచాయతీల ఎన్నికకు సంబంధించి పోలింగ్ లో పాల్గొనే రిటర్నింగ్ అధికారులు మరియు సహాయ రిటర్నింగ్ అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు, ఎన్నికల నియామావళిని అనుసరించి మొదటి విడత శిక్షణా తరగతులు ఈ నెల 13వ తేదీ కొత్తగూడెంలోని జడ్పీహెచ్ఎస్ ఆనంద ఖని మార్వాడి క్యాంప్ నందు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఈ శిక్షణా తరగతుల్లో రిటర్నింగ్ అధికారులు మరియు సహాయ రిటర్నింగ్ అధికారులు 350 మంది మరియు ఎంపోటీలు 46 మంది శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు.



## కులాల కుంపట్లో చలికాచుకుంటున్న
# రాజకీయ పార్టీలు!

ఏ రోజుకు ఏది అవసరమో అది మాట్లాడడం..ఆయా వర్గాలను ఆకట్టుకునేలా చెప్పడం రాజకీయ పార్టీలకు షరా మామూలు అయ్యింది. దేశంలో బడుగు,బలహీన వర్గాలతో పాటు, నిమ్న వర్గాలను దువ్వడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయి. తాజాగా ఇప్పుడు ఎస్సీవర్గీకరణ, బిసి కులగణన వ్యవహారం నడుస్తోంది. ఈ రెండు వర్గాలను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీలు జెండాలెత్తుకున్నాయి. తామే వారికి రక్షణ కవచమని, వారి అభ్యున్నతే తమ రాజకీయం అని చెబుతున్నాయి. తెలంగాణలో బిసి కులగణన సరిగా జరగలేదని బిజెపి, బిఆర్ఎస్ వాదిస్తున్నాయి. పక్కా ప్రణాళికతో చేపట్టామని కాంగ్రెస్ చెబుతోంది. ఎవరు కరెక్ట్..ఎవరు రాంగ్ అన్నది ఆయా వర్గాల ప్రజలు విశ్లేషించుకుంటున్నారు. నిజానికి ఏ పార్టీ కూడా ఈ కులాలకు పెద్దపీట వేయడంలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడుగా దళితుడైన మల్లికార్జున ఖర్గే ఎన్నికైనా అది పేరుకు మాత్రమే. పెత్తనం, వ్యవహారమంతా రాహుల్, సోనియా, ప్రియాంకల గుప్పిట్లో ఉంది. అదో కుటుంబ పార్టీగా మారింది. బిఆర్ఎస్‌లో అయితే పక్కా కుటుంబ పార్టీయే. టిడిపి కూడా మరీ కుటుంబ పార్టీ అనక తప్పదు. వీరంతా ఇప్పుడు కులాల ఉద్ధరణకు వీరతాళ్లు వేసుకున్నారు. బిసిలపై కాంగ్రెస్‌కు ప్రేమలేదని, వారిని మోసం చేశారని తెలంగాణలో బిజెపి, బిఆర్ఎస్‌లు అంటున్నాయి. అందుకే ఇప్పుడు బిజెపి కూడా బిసి అధ్యక్షుడిని చేస్తుందన్న ప్రచారం ఉంది. కాంగ్రెస్ ఇప్పటికే బిసిని అధ్యక్షుడిగా చేసేసింది. బిఆర్ఎస్‌లో ఆ ఛాన్స్ లేదు. అక్కడ వెలమదొరలు తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. టిడిపిలో చంద్రబాబు కుటుంబం తప్ప మరొకరికి ఛాన్స్ లేదు. ఇలా పార్టీల్లోనే న్యాయంచేయలేని వారు ఎస్సీ, బిసిలకు న్యాయం చేస్తామంటే నమ్మడం ఎలా అన్నదే సమస్య. దేశంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సమాఖ్యలు అన్నీ అగ్రవర్ణాల నాయకత్వంలోనే నడుస్తున్నాయి. కమ్యూనిస్టుల్లో కూడా అగ్రకులాలదే పెత్తనం అని వేరుగా చెప్పనక్కరలేదు. తమ గుప్పిట్లో అధికారం ఉండాలి...కానీ తమ మాత్రం కింది కులాల వారికి అండగా ఉన్నామని చెప్పుకోవాలన్న తలబిరుసుతనంతో ఆయా పార్టీల నేతలు ఉన్నారు. అందుకే పార్టీ నాయకత్వ మైనా, అధికార పెద్దరికమైనా చేజారిపోకుండా జాగ్రత్త పడుతూనే ఉంటారు. ఇప్పటికీ తక్కువ కులాల్లో జాతి వివక్ష కొనసాగుతోంది. దీనిని తొలగించి వారిని సమాజాంలో అందరితో సమానంగా చేయడానికి ప్రయత్నాలు సాగడం లేదు. అంతెందుకు కులవ్యవస్థ నిర్మూలనకు ఎవ్వరూ పోరాడడం లేదు. కులాల పేరు చెప్పి రాజకీయ పబ్బం గడుపుకునేందుకు అలవాటు పడ్డ వీరు కలుఆలను సజీవంగా కొనసాగించేలా చేస్తున్నారు. బడుగువర్గాల, శ్రమజీవుల ప్రతినిధులమని చెప్పుకొనే పార్టీల్లో కూడా ఈ జాడ్యం కొనసాగడం దారుణం. మరోవైపు అగ్రకుల అధిపత్యానికి విరుద్ధంగా..పాలనలో తమ వాటా, భాగస్వామ్యం కోసం దేశం లోని బిసిలు, దళితులు గట్టిగా పోరాడలేక పోతున్నాయి. కాన్షీరామ్ బిఎస్‌పి స్థాపించి సంచలనం సృష్టించినా, అధికార యావలో ఆ పార్టీ కొట్టుకుపోయింది. అంతెందుకు తెలంగాణలో దళిత ఉద్ధరణ అంటూ బయలుదేరి బిఎస్‌పిలో చేరిన ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా అధికార యావలో బిఆర్ఎస్‌లో చేరారు. బిఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పిన ఆయన చివరకు అదేపార్టీ చంకనెక్కారు. అంటే ఏదో ఒక డబ్బున్న పార్టీలో చేరితే తప్ప మనుగడ లేదని ఆయన గుర్తించివుంటారు. నిజానికి బిసిలు సమగ్ర కులగణన కోరుతున్నారు. మాదిగలు ఎస్‌సి రిజర్వేషన్లలో తమ వాటా తేల్చమంటున్నారు. తాజాగా ఎబిసిడి వర్గీకరణ జరగాలని మందకృష్ణమాదిగ కోరుతున్నారు. వీరి డిమాండ్లు క్రమంగా రాజకీయ ప్రాధాన్యతను పొందాయి. గత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు వీటి ప్రస్తావన తేక తప్పలేదు. తాజాగా ఇప్పుడు పంచాయితీ ఎన్నికలు రావడంతో అన్నిరాజకీయ పార్టీలు బిసిలకు తామే ప్రతినిధులం అన్నట్లుగా బయలుదేరాయి. తొమ్మిదన్నరేళ్లు అన్ని వర్గాలను అణగదొక్కి, తెలంగాణ పేరు చెప్పి దోచకున్న బిఆర్ఎస్ నేతలుకూడా బిసిలపట్ల ఎక్కడ లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో గెలిపిస్తే దేశంలో బిసిల కులగణన చేపడతామని రాహుల్ గాంధీ చెబుతూ వచ్చారు. ఎస్‌సి రిజర్వేషన్లలో మాదిగలకు న్యాయం చేస్తామని భరోసా ఇస్తూ ప్రధాని మోడీ ఎన్నికల ప్రచార వేదికపై మందకృష్ణ మాదిగ కన్నీళ్లు తుడిచారు. నిజం ఏమిటంటే ఈ రెండు సమస్యలు రాజకీయ క్షేత్రంలో పావులుగా వాడుకోవడానికి అన్ని పార్టీలకు ఉపయోగపడుతున్నాయి. ఏ ప్రధాన రాజకీయ పార్టీకి వీరి డిమాండ్ల పట్ల చిత్తశుద్ధి లేదనడంలో సందేహం లేదు. తమ రాజకీయ నిచ్చెనను ఎక్కడానికి వీరు మెట్లుగా ఉపయోగపడతారు కాబట్టి వారి గురించి మాట్లాడుతున్నారు. వారి సమస్యలను అధ్యయనం చేసి, వారి ఆకాంక్షలను నెరవేర్చి ఆయా వర్గాల అభ్యున్నతికి పాటుపడాలన్న ఆసక్తి ఏ రాజకీయపార్టీకి లేదనే చెప్పాలి. పైగా వారిని ఎదగకుండా చేసి, ఉన్నచోటనే ఉంచి అవసరానుగుణంగా వాడుకోవాలన్న రాజకీయ దురుద్దేశం కూడా ఆయా పార్టీ నేతలకుంది. దేశంలోని బిసిలు, మాదిగలు కోరుకుంటున్న విధంగా విధాన కల్పన చేయాలనీ ఏ ప్రభుత్వానికి లేదు. కింది కులాలు ఎదిగి తమ పీఠాలు కదిలించకుండా సకల జాగ్రత్తలు ఆ నాయకులు తీసుకుంటారు. నిజానికి దేశం అభివృద్దిలో పయనించాలంటే పేద, ధనిక వర్గాలను గుర్తించి వారికి పథకాలు అందచేయాలి. దళిత,బిసి వర్గాలను గుర్తించి వారి ఆర్థిక స్థోమత ఆధారంగా పతకాలు రచించాలి. విద్య,ఉద్యోగ రంగాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయంగా వారిని భాగస్వాముల ను చేయాలి. కులనిర్మూలన చేసి భారతజాతిని ఏకంచేయాలి. అలాచేసే ధైర్మం ఉందా అన్నది చెప్పాలి. కులాల కుంపట్లు రాజేసి రాజకీయ లబ్ది పొందే రాజకీయ స్వార్థ పరుల పట్ల ఆయా కులాల వారు జాగ్రత్తగా ఉండడం ఎప్పటికీ అసరం.

# అక్రమంగా ఉద్యోగం పొందిన వారికి ఓఎస్డీ పోస్టా..?

**ప్రో. మల్లారెడ్డిని ఓఎస్డీ పదవీ నుండి తొలగించాలి**

**గతంలోనూ ప్రో. మల్లారెడ్డి నియామకం చెల్లదని ఫిర్యాదు**

**కేయూ వీసీ వద్ద విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్**



హనుమకొండ కేయు, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఈరోజు బుధవారం కేయూ ఉపకులపతి ప్రో. ప్రతాప్ రెడ్డిని కలిసి అక్రమంగా అసోసియేట్ ప్రొఫెసర్ గా నియామకం అయిన ప్రో. మల్లారెడ్డిని ఓఎస్డీ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో ప్రో. మల్యారెడ్డి పరీక్షల విభాగం కంట్రోలర్ గా వున్నప్పుడు 100కి 105 మార్కులు వేసిన ఘనత ప్రో మల్లారెడ్డికి వుందని అన్నారు. గతంలో కేయూ రిజిస్ట్రార్ గా పనిచేసినప్పుడు ప్రో. మల్యా రెడ్డి అసోసియేట్ ప్రొఫెసర్ నియామకంపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి, ఉన్నత విద్యా శాఖ కార్యదర్శికి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నత కార్యదర్శి వెంకటేశం ఈ ఫిర్యాదు పై విచారణ జరిపి వెంటనే నివేదిక పంపాలని అప్పటి వైస్ చాన్సలర్ వాకాటి కరుణకు ఉత్తర్వులు (నెం.1457/UE/A2/2024) కూడా జారీ చేసారని అన్నారు. అక్రమంగా నియామకం అయిన వారిని తిరిగి ఓ.ఎస్.డీ గా నియమించడం సిగ్గుచేటని అన్నారు.



## అక్రమంగా ఉద్యోగం పొందిన వారికి ఓ.ఎస్.డీ పోస్టా..?

గత ఏడాది జూలై 29 న మరియు జూలై 30 న హన్మకొండకు చెందిన కే.ఎన్.రెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి మరియు ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి ప్రో. మల్యా రెడ్డి నియామకంపై ఫిర్యాదులు పంపిన విషయం విదితమే. కాకతీయ యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఆయన తొలి నియామకం చట్టవిరుద్ధం కాబట్టి, అతను రిజిస్ట్రార్ పదవిని కలిగి ఉండటానికి అర్హత లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు సమాచారం. కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ నోటిఫికేషన్ నంబర్. 04/2006, తేదీ 29/9/2006 ద్వారా నోటిఫికేషన్ చివరి తేదీ నాటికి ప్రొఫెసర్ పి. మల్లా రెడ్డికి నిబంధనల ప్రకారం అసోసియేట్ ప్రొఫెసర్‌కు అవసరమైన అర్హతలు లేవు. నోటిఫికేషన్‌కి చివరి తేదీగా యూజీసీ నిబంధనలలో పేర్కొన్నట్లుగా ప్రొఫెసర్. పి. మల్లా రెడ్డికి ఐదేళ్ల బోధన మరియు/లేదా పరిశోధన అనుభవం లేదు. నోటిఫికేషన్ యొక్క చివరి తేదీగా అతనికి 4 సంవత్సరాల డాక్టరల్ పరిశోధన అనుభవం మాత్రమే ఉంది, ఇది అసోసియేట్ ప్రొఫెసర్‌కు అర్హత కాదు. అతని దరఖాస్తులో అతను క్లెయిమ్ చేసిన బోధనా అనుభవం అర్హత కలిగిన అనుభవం కాదు మరియు పైన పేర్కొన్న నిబంధనల ప్రకారం అర్హత లేదు అని ఫిర్యాదులో పేర్కొన్నారు. అవసరమైన అర్హతలు లేకున్నా, విశ్వవిద్యాలయం ఆయనను అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించిందని, అప్పటి అధికారులు నిబంధనలను ఉల్లంఘించి పి.మల్లారెడ్డితో కుమ్మక్కై అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించారని, కాబట్టి, కాకతీయ విశ్వవిద్యాలయంలో అసోషియా ప్రొఫెసర్‌గా అతని నియామకం చట్టవిరుద్ధం మరియు వెంటనే విశ్వవిద్యాలయం నుండి తొలగించబడాలని అన్నారు.

## ప్రో. మల్లారెడ్డిని తొలగించే వరకు విద్యార్థి సంఘాల నిరసనలు

ప్రో. మల్లారెడ్డి ని ఓ.ఎస్.డీ పోస్టు నుండి తొలగించేటంత వరకు విద్యార్థి సంఘాలు నిరసనలు చేపడుతామని వీసీ ప్రతాప్ రెడ్డితో అన్నారు. దీనికి వీసీ స్పందిస్తూ ఇలాంటి తప్పిదాలు మరోసారి జరగవని అనుభవం కలిగిన వ్యక్తులకే ఓ.ఎస్.డీ పోస్టు ఇస్తామని విద్యార్థి సంఘాలతో మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీలో ఓ ఎస్ డి నుంచి మల్లారెడ్డిని తొలగించకపోతే పెద్ద ఎత్తున కాకతీయ యూనివర్సిటీలో కార్యక్రమాలు నిర్వహిస్తామని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కి హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్**



ములుగు జిల్లా, ఫిబ్రవరి 12 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే గ్రామపంచాయతీ ఎన్నికల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమాలకు లోబడి, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా ఎన్నికల కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఒంటేరు దేవరాజ్ తెలిపారు. బుధవారం ములుగు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ మరియు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల సంబంధించి మొదటి దశ లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం, పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను తయారు చేయడం మరియు రెండవ దశలో గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అనంతరం ఉపసర్పంచ్ రాష్ట్ర ఎన్నికల కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమాలకు లోబడి నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాస్థాయి ట్రైనర్స్ తెలియజేసిన అంశాలను సంపూర్ణ అవగాహన చేసుకుని నామినేషన్ల స్వీకరణ సందర్భంలో మరియు నామినేషన్ల పరిశీలన సందర్భంలో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన సందర్భంలో పోలింగ్ ప్రక్రియ నిర్వహించడం, కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం, ఎన్నికల ఫలితాల అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక తదితర విషయాలను ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా నిర్వహించారని గ్రామపంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ మరియు సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎంపీడీఓ రామకృష్ణ, మల్లంపల్లి ఎంపీడీఓ రహీముద్దీన్,, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు శిరుప సతీష్ కుమార్, ఎండి హమీద్, డి సూర్యనారాయణ ,ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎం శ్రీకాంత్, ఎల్ రమేష్, ఎం మధు, టి రాజేష్, ఏ రవీందర్, పాల్గొన్నారు



## కేసులను తప్పదోవ పట్టించే యత్నం

**ఆరోపణలు, ఎదురుదాడులతో బిఆర్ఎస్ డ్రామా**

**హైదరాబాద్, నవంబర్ 12 (తీన్మార్ న్యూస్):** మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిన చందంగా ఇప్పుడు బిఆర్ఎస్ అన్ని వర్గాలకు ప్రాతినిధ్య పార్టీగా ప్రచారం చేసుకుంటోంది. రైతులపట్ల ఎక్కడలేని ప్రేమను ఒలకబోస్తోంది. వారి సమస్యలపై జిల్లాల వారీగా పోరాటాలు చేస్తోంది. ధర్నాలు చేస్తోం ది. హాస్టళ్లలో పురుగుల అన్నం అని గగ్గోలు పెడుతోం ది. బిసిలకు కాంగ్రెస్ ద్రోహంచేస్తోందని అంటోంది. జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని అంటోంది. గ్రామీణ వైద్యులకు అన్యాయం జరిగిపోయిందని వారి ధర్నలకు మద్దతు ప్రకటించింది. ఇలా చెప్పుకుం టూ పోతే తెలంగాణలో సకల సమస్యలన్నీ కాంగ్రెస్ వల్లనే పుట్టుకు వచ్చాయని ప్రచారం చేసి, ఆయా వర్గాలను దువ్వే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గతంలో ప్రజల్లోకిరాకుండా, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా, తొమ్మదిన్నరేళ్లు నిరంకుశంగా పాలించిన బిఆర్ఎస్ ఇప్పుడు చిలకపలుకులతో బయలుదేరింది. ఓవైపు తమ హయాంలో జరిగిన అవినీతిపై ఓ వైపు విచారణ సాగుతోంది. వాటికి సమాధానం ఇవ్వడం లేదు. కానీ ఏడాది రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం తెలంగాణ ఆగమైందని వలపోస్తున్నారు. అమృత్ పథకంలో అక్రమాలు జరిగాయని ఫిర్యాదుచేశారు. గతంలో ప్రధాని స్వయంగా కాళేశ్వరం కెసిఆర్‌కు ఎటిఎంలాగా మారిందని ప్రధాని స్వయంగా ఆరోపించారు. బిజెపి నేతలు కూడా ఆరోపించారు. వీటిని తిప్పికొట్టడం మినహా బిఆర్ఎస్ చేసిందేమీ లేదు. ఇప్పుడు కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేసింగ్ తదిరాల్లో అవినీతి గుప్పుమంది. అమృత్ పథకంలో భారీ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రమంత్రికి ఖట్టర్‌కు ఫిర్యాదు చేశారు. టెండర్లు రద్దు చేసి వెంటనే ఈ విషయంపై విచారణ చేపట్టాలని సూచించారు. రేవంత్ రెడ్డి భావమరిది సృజన్ రెడ్డికి ఈ టెండర్లు అక్రమంగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపి స్తున్నారు. ఇవే కాకుండా మరిన్ని కుంభకోణాలు రాబోతున్నాయని టీజర్ కూడా ఇచ్చేశారు. సీరియల్ మాదిరి అన్ని శాఖల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని హెచ్చరించారు. తెలంగా ణలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలను జాతీయ స్థాయిలోనే ఎండగడతామని ఎన్నిసార్లు అయి నా ఢిల్లీ వస్తామని అన్నారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకనో బిఆర్ఎస్ దూరంగా ఉంది. ఈ మధ్య కాలంలో రేవంత్ రెడ్డిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఫార్ములా ఈ- కార్ రేస్ కేసులో కీలక మలుపు తిరుగుతుందని కీలక వ్యక్తులను విచారించేందుకు అవకాశం ఉందని అంటున్నారు. ఈ కేసులో కీలకంగా కేటీఆర్ పేరు వినిపిస్తోంది. అయనపై ఎసిబి విచారణ సాగుతోంది. మొత్తంగా అవినీతి కేసుల్లో బిఆర్ఎస్ నేతలు బయటపడతారా లేక విచారణతో కాలయాపన చేస్తారా అన్నది చూడాలి.

## ఇన్ఫోసిస్ ఉద్యోగుల వేతనాలు పెంపు..
# నెలాఖరులో లెటర్స్!



ప్రముఖ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఉద్యోగులకు త్వరలో తీపి కబురు చెప్పనుంది. అర్హులైన ఉద్యోగులకు వేతనాల పెంపును ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. దీనికి సంబంధించి ఈ నెల ముగిసేలోగా ఉద్యోగులకు వేతన పెంపునకు సంబంధించిన లేఖలు జారీ చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయని 'మనీకంట్రోల్' తెలిపింది. ఈ వేతన పెంపు 5–8 శాతం మధ్య ఉండొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ నుంచి పెరిగిన వేతనాలు అమల్లోకి రానున్నాయి. ఇటీవల వెల్లడించిన మూడో త్రైమాసిక ఫలితాల సందర్భంగానూ 6 –8 శాతం వార్షిక వేతన పెంపు ఉండొచ్చని కంపెనీ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్‌రాజ్‌కా వెల్లడించారు. ఇన్ఫోసిస్ బ్యాచ్‌ల వారీగా ప్రమోషన్ లెటర్లు జారీ చేయడం ప్రారంభించింది. డిసెంబర్‌లో మొదటి బ్యాచ్ ఉద్యోగులకు ఈ లేఖలు అందాయి. ఫిబ్రవరి నెలాఖరులో మరికొందరికి ప్రమోషన్లు అందించనుంది. గతంలో లెటర్లు అందుకున్న వారికి జనవరి నుంచి వేతన పెంపు అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి నెల బ్యాచ్‌కు ఏప్రిల్ నుంచి వేతన పెంపు వర్తించనుంది. రానున్న రోజుల్లో ఐటీకి డిమాండ్ పుంజుకోవచ్చన్న అంచనాల వేళ ఇన్ఫీ ఈ వేతన పెంపు చేపడుతుండడం గమనార్హం. అత్యధికంగా అమెరికా నుంచి ఆదాయాలు అందుకొనే ఐటీ కంపెనీలు.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో టెక్నాలజీకి బడ్జెట్ పెరగొచ్చని భావిస్తున్నాయి. గడిచిన రెండేళ్లలో కొన్ని ఐటీ కంపెనీలు వేతన పెంపును వాయిదా సందర్భాలూ ఉన్నాయి.

## నిషేధిత చైనా యాప్‌లు
# మళ్లీ వచ్చేశాయ్!



దేశీయ భద్రత, డేటా గోప్యతపై ఆందోళన కారణంగా నిషేధించిన చైనా యాప్‌లు తిరిగి భారత్‌లోకి వచ్చేశాయి. యాప్‌ల పేర్లు, వెర్షన్లు మార్చి మళ్లీ విడుదలయ్యాయి. ఆ యాప్‌లలో కొన్నింటికి యాజమాన్య హక్కులు మారగా.. మరికొన్ని చైనా కంపెనీలుగానే కొనసాగుతున్నట్లు సమాచారం. భద్రతా సమస్యల కారణంగా 2020లో దాదాపు 267 చైనా యాప్‌లపై భారత్ నిషేధం విధించింది. సరిహద్దులోని గల్వాన్ వద్ద భీకర ఘర్షణ తర్వాత దేశంలో చైనా తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో భారత్ ఈ చర్యలు తీసుకుంది. అయితే ఇప్పుడు ఆ యాప్‌ల పేర్లు, వెర్షన్లు మార్చి తిరిగి భారత్‌లో విడుదలయ్యాయి. గతంలో నిషేధించిన యాప్‌లలో 36 అప్లికేషన్లు తిరిగి భారత్‌లోకి వచ్చాయి. వాటిలో కొన్ని బ్రాండింగ్, లోగోల్లో చిన్న మార్పులు చేసి తీసుకొచ్చారు. వీటిలో ఫైల్– షేరింగ్ సర్వీస్, స్ట్రీమింట్ ప్లాట్‌ఫామ్ మ్యాంగో టీవీ, షాపింగ్ యాప్ టావోబావో, డేటింగ్ యాప్ టాన్‌టాన్, షాపింగ్, ఎంటర్‌టైన్‌మెంట్, ఫైల్ షేరింగ్, కంటెంట్ క్రియేషన్‌కు చెందిన అప్లికేషన్లు ఉన్నాయి. ఈ యాప్‌లన్నీ ఇప్పుడు గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో డౌన్‌లోడ్ చేసుకొనేందుకు అందుబాటులో ఉన్నాయి. నిషేధిత చైనా యాప్‌లు భారత్‌లోకి తిరిగి ప్రవేశించడానికి వేర్వేరు మార్గాలు ఎంచుకున్నాయి. ప్రముఖ ఫ్యాషన్ రిటైలర్ అయిన షీన్.. రిలయన్స్ లైసెన్సింగ్ ఒప్పందం ద్వారా భారత్‌కు తిరిగి వచ్చింది. షీన్‌కు సంబంధించిన వినియోగదారుల డేటా ఇప్పుడు భారత్‌లోనే స్టోర్ అవుతుందని, చైనాస్ మాతృ సంస్థకు యాక్సెస్ లేదని భారత్ ప్రభుత్వం స్పష్టంచేసింది. నిషేధం ఎదుర్కొంటున్నప్పటికీ అనేక యాప్‌లు క్లోన్ వెర్షన్‌లు తెరపైకి వస్తున్నాయి. వాటిని పూర్తిగా బ్యాన్ చేయడం కష్టంగా మారుతోంది. ఉదాహరణకు.. 2020లో పబ్‌జీ నిషేధించారు. కానీ 2021లో దక్షిణ కొరియా క్రాఫ్టన్ ఆధ్వర్యంలో బ్యాటిల్‌గ్రౌండ్స్ మొబైల్ ఇండియాగా తిరిగి వినియోగంలోకి వచ్చింది. అయితే ఇది కూడా 2022లో నిషేధం ఎదుర్కొంది. ఆ తర్వాత దేశీయ భద్రత, ప్రమాణాలను అనుసరించి 2023లో పునరుద్ధరించింది.

## కర్ణాటకలో ఎప్సిలాన్ గ్రూప్
# రూ.15,350 కోట్ల పెట్టుబడి

ఎప్సిలాన్ గ్రూప్ కర్ణాటకలో ఈవీ బ్యాటరీ టెస్టింగ్, అధునాతన మెటీరియల్స్ కోసం..తయారీ, పరిశోధనా సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి రూ.15,350 కోట్ల పెట్టుబడి పెట్టే ప్రణాళికను బుధవారం ప్రకటించింది. బెంగళూరులో జరిగిన ఇన్వెస్ట్ కర్ణాటక సమ్మిట్‌లో ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎప్సిలాన్ తెలిపింది. ఈ వ్యూహాత్మక పెట్టుబడి, రాబోయే 10 ఏళ్లలో దశలవారిగా జరుగుతుంది. అధునాతన బ్యాటరీ సాంకేతికత కేంద్రంగా భారత్ స్థానాన్ని సుస్థిరం చేస్తామని 'ఎప్సిలాన్ గ్రూప్' పేర్కొంది. ఎంఓయూలో భాగంగా, ఎప్సిలాన్ గ్రూప్, దాని అనుబంధ సంస్థలైన ఎప్సిలాన్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, ఎప్సిలాన్ క్యామ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి స్థిరమైన, అధిక పనితీరు గల గ్రాఫైట్ యానోడ్, లిథియం ఐరన్ ఫాస్ఫేట్ కాథోడ్ బ్యాటరీ ఉత్పత్తులను తయారుచేస్తుంది. గ్రాఫైట్ యానోడ్ తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.9 వేల కోట్లు, ఎల్ఎఫ్‌పీ కాథోడ్ తయారీ ప్లాంట్‌కు రూ.6 వేల కోట్లు, బ్యాటరీ మెటీరియల్స్, బ్యాటరీ టెస్టింగ్ ఆర్అండ్‌డీ, శిక్షణా కేంద్రం కోసం రూ.350 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ తెలిపింది. చైనా దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం, స్థానిక బ్యాటరీ మెటీరియల్ ఎకోసిస్టంను నిర్మించడంలో తమ పెట్టుబడి కీలకమైన అడుగు అని ఎప్సిలాన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ 'విక్రమ్ హండా' తెలిపారు. ఈ పెట్టుబడి..దేశీయ, అంతర్జాతీయ ఈవీ తయారీదారు లకు కీలకమైన బ్యాటరీ మెటీరియల్స్ సరఫరాను మెరుగుపరుస్తుందని, భారత్‌ను గ్లోబల్ బ్యాటరీ హబ్‌గా మారుస్తుందని కంపెనీ తెలిపింది.





## ఎయిర్ ఫైబర్ సేవలపై
# ఎయిర్‌టెల్ ఫోకస్..
### నోకియాతో డీల్

ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు విస్తరించేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా హైస్పీడ్ 5జీ ఇంటర్నెట్ సేవలను అందించేందుకు 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ డివైజులు, వైఫై సొల్యూషన్స్ సరఫరా కోసం నోకియా, క్వాల్‌కామ్‌తో జట్టుకట్టింది. ఈ డివైజులు భారత్‌లోనే తయారు కానున్నాయని కంపెనీ ఓ ప్రకటనలో బుధవారం తెలిపింది. అయితే, కాంట్రాక్టుకు సంబంధించిన వివరాలు మాత్రం కంపెనీ వెల్లడించలేదు. దేశీయంగా బ్రాండ్‌బ్యాండ్ వినియోగం పెరుగుతోంది. అదే స్థాయిలో ఫైబర్ కనెక్టివిటీ విస్తరించడం లేదు. దీంతో జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు ఎయిర్‌ఫైబర్ సేవలకు శ్రీకారం చుట్టాయి. ఫైబర్‌నెట్ విస్తరించని ప్రాంతంలో బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించేందుకు ఈ ఎయిర్‌ఫైబర్ సేవలు ఉపయోపడతాయి. దీన్ని మరింత వేగంగా విస్తరించేందుకు ఈ డీల్ ఎయిర్‌టెల్‌కు ఉపయోగపడనుంది. కాంట్రాక్టులో భాగంగా ఫిక్స్‌డ్ వైర్‌లైన్ యాక్సెస్ ఔట్‌డోర్ రిసీవర్లు, వైఫై 6 యాక్సెస్ పాయింట్లను నోకియా సరఫరా చేయనుంది. నోకియా అందించే ఫాస్ట్‌మైల్ 5జీ ఔట్‌డోర్ రిసీవర్లకు ఒకటి కంటే ఎక్కువ యూనిట్లను కనెక్ట్ చేయొచ్చు. అంటే రెండిళ్లకు ఒకే యూనిట్ అమర్చొచ్చు. దీనివల్ల కంపెనీకి ఖర్చులు సైతం తగ్గనున్నాయి. అలాగే, ఈ యూనిట్లు పవర్–ఓవర్–ఈథర్‌నెట్ టెక్నాలజీ సాయంతో పనిచేస్తాయి. దీని కోసం ప్రత్యేకంగా పవర్ సప్లయ్ అవసరం లేదు. లోపల వైఫై యాక్సెస్ పాయింట్లను వచ్చే పవర్‌తో ఇవి పనిచేస్తాయి. దీనివల్ల గోడలు, బాల్కనీ, స్తంభాలు.. ఇలా ఎక్కడైనా వీటిని అమర్చొచ్చు. ఇంటి లోపల భాగంలో నోకియా వైఫై 6 యాక్సెస్ పాయింట్లను అమర్చుతారు. ఇవి పూర్తిగా రీసైకిల్ చేయడానికి వీలుండే మెటీరియల్‌తో రూపొందుతాయని కంపెనీ వెల్లడించింది.

## ఇండిగో వాలంటైన్స్ డే సేల్..
### టికెట్ బుకింగ్స్‌పై 50% వరకు డిస్కౌంట్!



ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో.. వాలైంటైన్స్ డే సేల్‌ను తీసుకొచ్చింది. టికెట్ల బుకింగ్‌పై 50 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తోంది. ఇద్దరు ప్రయాణికులకు కలిపి బుక్ చేస్తే ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఫిబ్రవరి 12 నుంచి ఫిబ్రవరి 16 వరకు చేసే బుకింగ్‌లకు ఈ ఆఫర్ వర్తిస్తుందని కంపెనీ పేర్కొంది. బుకింగ్ తేదీకి, ప్రయాణ తేదీకి మధ్య కనీసం 15 రోజుల వ్యవధి ఉండాలని పేర్కొంది. ఇండిగో వెబ్‌సైట్, మొబైల్ యాప్, ఇండిగో 6ఈ ఏఐ చాట్‌బాట్, ఎంపిక చేసిన ట్రావెల్ పార్ట్‌నర్స్ వేదికగా బుక్ చేసినప్పుడు ఈ ఆఫర్ పొందొచ్చని కంపెనీ తెలిపింది. టికెట్ ధరతో పాటు ప్రయాణికులు ట్రావెల్ యాడ్ ఆన్స్‌పైనా డిస్కౌంట్లు పొందొచ్చని కంపెనీ తెలిపింది. అదనపు బ్యాగేజీపై ముందస్తు బుకింగ్‌పై 15 శాతం, సీట్ల ఎంపికపై 15 శాతం, ముందస్తుగా బుక్ చేసే మీల్స్‌పైనా 10 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తామని ఇండిగో తెలిపింది. దీంతోపాటు ఫిబ్రవరి 14న ఇండిగో సంస్థ ఫ్లాష్ సేల్ నిర్వహించబోతోంది. మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా చేసే తొలి 500 బుకింగ్స్‌పై అదనంగా 10 శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు ఇండిగో తెలిపింది. 14న రాత్రి 8 గంటల నుంచి 11.59 గంటల మధ్య నిర్వహించనున్నట్లు తెలిపింది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాలకు ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపింది. ప్రధాన సేల్‌లానే ఫ్లాష్‌సేల్ బుకింగ్‌లోనూ టికెట్ బుకింగ్‌కు 15 రోజుల వ్యవధి ఉండాలని కంపెనీ తెలిపింది.

# ఆరో రోజూ నష్టాలే..
### సెన్సెక్స్ -900, - 122 పాయింట్లకు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల నష్టాల పరంపర కొనసాగుతోంది. వరుసగా ఆరో రోజూ సూచీలు నష్టపోయాయి. ఓ దశలో సూచీలు భారీ నష్టాల్లోకి వెళ్లాయి. సెన్సెక్స్ 76 వేలు, నిఫ్టీ 23 వేల దిగువకు చేరాయి. అయితే, మళ్లీ అంతే స్థాయిలో సూచీలు బలంగా పుంజుకోవడం, స్వల్ప నష్టాలకే సూచీలు పరిమితం కావడం మదుపర్లకు ఊరటనిచ్చే అంశం. రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ షేర్లు సూచీలపై ఒత్తిడి పెంచగా.. హెచ్‌డీఎఫ్‌సీ, ఎల్‌అండ్‌టీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఉదయం 76,188.24 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,293.60) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంది. ఓ దశలో దాదాపు 900 పాయింట్ల నష్టంతో 75,388.39 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. అంతే బలంగా పుంజుకొని 76,459 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 122.52 పాయింట్ల నష్టంతో 76,171.08 వద్ద ముగిసింది. నిఫ్టీ 27.80 పాయింట్ల నష్టంతో 23,044 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 9 పైసలు బలహీన పడి 86.88 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, రిలయన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు కాస్త తగ్గుముఖం పట్టి 2910 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## బీట్స్ కొత్త ఇయర్‌ఫోన్స్.. ధర 29వేల పైనే!



ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ బీట్స్ ఆకర్షణీయమైన డిజైన్‌తో కొత్త ఇయర్‌ఫోన్స్ భారత్‌లో లాంచ్ చేసింది. పవర్‌బీట్స్ ప్రో 2 పేరిట కొత్త ఫీచర్లతో దీన్ని పరిచయం చేసింది. యాక్టివ్ నాయిస్ క్యాన్సిలేషన్, డైనమిక్ హెడ్ ట్రాకింగ్ సదుపాయంతో ఆకర్షణీయమైన రంగుల్లో వీటిని తీసుకొచ్చారు. వీటి ధర, ఫీచర్లపై ఓ లుక్కేయండి. పవర్‌బీట్స్ ప్రో 2 ధర రూ.29,900గా కంపెనీ నిర్ణయించింది. ఎలక్ట్రిక్ ఆరెంజ్, హైపర్ పర్పుల్, జెట్ బ్లాక్, క్విక్ సాండ్.. రంగుల్లో లభిస్తాయి. ప్రస్తుతం కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఫిబ్రవరి 13 నుంచి ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వేదికగా కొనుగోలు చేసేందుకు వీలు కల్పిస్తున్నారు. డైనమిక్ హెడ్ ట్రాకింగ్ టెక్నాలజీతో స్పెషల్ ఆడియోకు సపోర్ట్ చేస్తాయి. ఆండ్రాయిడ్, ఐఫోన్ యూజర్లకు బ్లూటూత్ 5.3 కనెక్టివిటీకి ఈ ఇయర్‌ఫోన్స్ సపోర్ట్ చేస్తాయని కంపెనీ లాంచింగ్ సమయంలో వెల్లడించింది. యాపిల్ డివైజెస్‌లో అయితే వన్– టచ్ పెయిరింగ్, ఆటోమెటిక్ స్విచ్చింగ్, ఆడియో షేరింగ్, హ్యాండ్– ఫ్రీ సిరీ.. లాంటి ఫీచర్లకు సపోర్ట్ చేస్తాయి. అయితే ఈ ఫీచర్లన్నింటినీ బీట్స్ యాప్ ద్వారా ఆండ్రాయిడ్ యూజర్లు వినియోగించుకోవచ్చు. ఐదు సైజుల ఇయర్ టిప్స్‌ని ఈ ఇయర్‌ఫోన్స్‌కి బీట్స్ ఇస్తోంది. యాపిల్ హెచ్2 చిప్‌తో వస్తోన్న ఈ ఇయర్‌ఫోన్స్ 10 గంటల పాటు ప్లే బ్యాక్ టైమ్ కలిగిఉంటాయి. ఛార్జింగ్ కేసుతో పాటు 45 గంటల పాటు పని చేస్తాయి. కేవలం 5 నిమిషాల ఛార్జింగ్‌తో 90 నిమిషాల పాటు ప్లే బ్యాక్ టైమ్ ఇస్తాయి.

# ఆదాయపు పన్ను బిల్లు
### : 622 పేజీలు - 536 సెక్షన్లు



ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురానున్నట్లు ఇటీవల ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఆదాయపు పన్ను బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ బిల్లును గురువారం (ఫిబ్రవరి 13న) లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. కాగా.. ఇందులో 536 సెక్షన్లు, 23 ఛాప్టర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961లో 298 సెక్షన్లు ఉండగా.. కొత్తగా తీసుకురానున్న బిల్లులో 536 సెక్షన్లను చేర్చినట్లు తెలిసింది. ప్రస్తుతమున్న 14 షెడ్యూల్‌ను కొత్త చట్టంలో 16కు పెంచనున్నారు. అయితే, ఇప్పటి చట్టంలో మాదిరిగానే నూతన బిల్లులోనూ 23 ఛాప్టర్లు ఉన్నాయి. కాగా.. పేజీల సంఖ్యను ప్రస్తుతమున్న దానితో పోలిస్తే దాదాపు సగానికి సగం తగ్గించారు. కొత్త బిల్లును 622 పేజీల్లో రూపొందించారు. 1961లో ఆదాయపు పన్ను చట్టాన్ని తీసుకొచ్చినప్పుడు దాన్ని 880 పేజీల్లో పొందుపర్చారు. ఆ తర్వాత గత ఆరు దశాబ్దాలుగా ఈ చట్టానికి పలు సవరణలు చేయడంతో పేజీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను చట్టంలో వ్యవస్థీకృత అంశాలు, పన్ను పథకాలు, ఇతర నిబంధనలకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ల కోసం పార్లమెంట్ వద్దకు సవరణల రూపంలో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అయితే, ప్రతిపాదిత బిల్లులో ఆ అవసరం లేకుండా.. సీబీడీటీకి కొన్ని స్వతంత్ర అధికారాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇకపై ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ రూల్స్, డిజిటల్ ట్యాక్స్ మానిటరింగ్ సిస్టమ్స్ వంటి వాటిని సీబీడీటీనే రూపొందించేలా కొత్త బిల్లులో ప్రతిపాదనలు చేశారు. గురువారం ఈ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఆ తర్వాత దీన్ని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించనున్నట్లు తెలుస్తోంది. ఆదాయపు పన్నును సరళీకరించేందుకు, పన్ను విధానాన్ని సులువుగా అర్థం చేసుకునేందుకు కొత్త చట్టాన్ని తీసుకురాబోతున్నామని ఇటీవల బడ్జెట్ ప్రసంగం సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. దీనిద్వారా అదనపు పన్ను భారమేమీ ఉండదని పేర్కొన్నారు. ఆదాయపు పన్ను చట్టాన్ని సమీక్షించాలంటూ ఐటీ విభాగానికి ఇప్పటివరకు 6,500 సూచనలు వచ్చాయి.

## సంక్షేమ పథకాల వల్లే కార్మికులు పని చేయట్లేదు
### ఎల్ అండ్ టీ ఛైర్మన్ వ్యాఖ్యలు



'భార్యను ఎంతసేపు చూస్తూ ఉండిపోతారు.. ఆదివారాలూ పనిచేయండి' అంటూ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ మరోసారి వార్తల్లో నిలిచారు. నిర్మాణ రంగంలో కార్మికుల వలసలు తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన ఆయన.. సంక్షేమ పథకాల అమలు కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. వాటివల్లే కార్మికులు పని చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. చెన్నైలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య సదస్సులో పాల్గొన్న ఆయన కార్మికుల కొరత అంశాన్ని ప్రస్తావించారు. "మా సంస్థలో ప్రస్తుతం 2.5 లక్షల మంది ఉద్యోగులు, 4 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఉద్యోగుల సంఖ్యలో తగ్గుదల ఉన్నప్పటికీ ఆ విషయం పెద్దగా బాధించట్లేదు. కానీ, కార్మికుల లభ్యత గురించి నేను ఎక్కువగా ఆందోళన చెందుతున్నా. ఈ రోజుల్లో కార్మికులు అవకాశాల కోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లేందుకు ఇష్టపడట్లేదు. బహుశా స్థానికంగా వారికి సంపాదన బాగానే ఉండొచ్చు. ఇక, అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా కారణం కావొచ్చు. వాటివల్లే వారు వేరే ప్రాంతాలకు వెళ్లి పనిచేయడానికి ఆసక్తి చూపించట్లేదు" అని సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యానించారు. "అయితే, కేవలం కార్మికుల్లో మాత్రమే కాదు.. వైట్ కాలర్ ఉద్యోగాలు చేస్తున్న వృత్తి నిపుణుల్లోనూ ఇదే భావన ఉందనిపిస్తోంది. నేను ఎల్ అండ్ టీ సంస్థలో ఇంజినీర్‌గా చేరినప్పుడు మా బాస్ దిల్లీలో ఉద్యోగం చేయాల్సిఉంటుందని చెప్పారు. కానీ, ఈ రోజుల్లో ఎవరైనా వ్యక్తిని అలా అడిగితే.. 'బై' అంటూ వెళ్లిపోతున్నారు" అని వివరించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆ మధ్య వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌పై సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. "ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు. ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలి. వారానికి 90 గంటల పాటు పనిచేయాలి. ఆదివారం సెలవునూ వదిలేయాలి" అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో పెను దుమారం లేపాయి. దీనిపై ఆ తర్వాత కంపెనీ స్పష్టతనిచ్చింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ లక్ష్యాలను చేరాలంటే అసాధారణ కృషి అవసరం అంటూ తన ఛైర్మన్ వ్యాఖ్యలను సమర్థించింది.






# టీమ్ఇండియా ఆల్‌రౌండ్ షో

## ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్

**అహ్మదాబాద్:** ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమ్ఇండియా 142 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. కీలక బ్యాటర్లంతా రాణించడంతో తొలుత భారత్ సరిగ్గా 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. శుభ్‌మన్ గిల్ (112, 102 బంతులలో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) 'శత'క్కొట్టాడు. ఈ భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్‌కు శుభారంభం దక్కినా తర్వాత చతికిలపడింది. ఆ జట్టు 34.2 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. టామ్ బాంటన్ (38), అట్కిన్సన్ (38, 19 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్లు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (23), బెన్ డకెట్ (34) పరుగులు చేశారు. జో రూట్ (24), హ్యారీ బ్రూక్ (19), బట్లర్ (6), లివింగ్‌స్టన్ (9) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. చివర్లో అట్కిన్సన్ పోరాటంతో ఇంగ్లాండ్ స్కోరు 200 దాటింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్‌కు తలో వికెట్ దక్కింది.

భారత బ్యాటర్లలో గిల్ సెంచరీకితోడు శ్రేయస్ అయ్యర్ (78, 64 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అదిరే ప్రదర్శన చేశాడు. కొంతకాలంగా విఫలమవుతున్న విరాట్ కోహ్లీ (52బీ 55 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) ఫామ్‌లోకి వచ్చేశాడు. రోహిత్ శర్మ (1) ఈ సారి నిరాశపర్చాడు. కేఎల్ రాహుల్ (40, 29 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. హార్దిక్ పాండ్య (17, 9 బంతుల్లో 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. వాషింగ్టన్ సుందర్ (14), అక్షర్ పటేల్ (13), హర్షిత్ రాణా (13) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 4, మార్క్‌వుడ్ 2, సకిబ్, అట్కిన్సన్, జో రూట్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

### ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా గిల్

ఈ సిరీస్‌లో అదరగొట్టిన శుభ్‌మన్ గిల్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపికయ్యాడు. గిల్ తొలి వన్డేలో 87, రెండో వన్డేలో 60 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇక, మూడో వన్డేలో సెంచరీ చేయడంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

## గూగుల్ ట్రెండ్స్‌లో 'భారత్-ఇంగ్లండ్' మ్యాచ్ రికార్డ్..!



మూడో వన్డేలో భాగంగా భారత్- ఇంగ్లండ్ మధ్య మైదానంలో జరుగుతున్న పోరు కోసం క్రికెట్ అభిమానులు ఉత్కంఠగా జరుగుతోంది. ప్రస్తుతం ఇరుదేశాల జట్ల మధ్య మ్యాచ్ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే నెటిజన్లు ఈ మ్యాచ్ కోసం ఆన్‌లైన్లో విపరీతంగా వెతకడం విశేషం. అభిమానులు మ్యాచ్‌కు ముందు 'భారత్ వర్సెస్ ఇంగ్లండ్' క్వేరీని ఏకంగా 10లక్షల సార్లు సెర్చ్ చేశారు. 'ఈ మ్యాచ్ ఏ ప్రసార వేదికగా చూడాలి'.. 'ఏఏ భాషల్లో ప్రసారం కొనసాగుతోంది" అంటూ తెగ వెతికేశారు. లైవ్ మ్యాచ్ మొదలైనప్పటికీ ఈ మ్యాచ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో శోధనలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రశ్న గూగుల్ ట్రెండ్‌లో ఉంది. కాగా.. ప్రస్తుతం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్- ఇంగ్లండ్ మ్యాచ్ కొనసాగుతోంది. టాస్ గెలిచిన టీమిండియా బ్యాటింగ్ ఎంచుకుంది. రోహిత్ శర్మ ఆట ప్రారంభంలోనే ఔట్ అయినప్పటికీ.. టీమిండియా దూకుడు కొనసాగించింది. శుభమన్ గిల్ సెంచరీ బాదాడు. ఈ ఇన్నింగ్స్‌తో వన్డేల్లో వేగంగా 2500 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.



## గంగూలీకి బిడ్ వేయలేదు..

### ఐదు నిమిషాల్లోనే 400 మెసేజ్‌లు: భట్టాచార్య

ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)కు సౌరభ్ గంగూలీ కూడా సారథిగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. కానీ, అతడి నాయకత్వంలో ఒక్కసారి కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది. దీంతో అతడిని 2011 ఐపీఎల్ వేలం సమయంలో కేకేఆర్ రిటైన్ చేసుకోలేదు. మెగా వేలంలోనూ అతడి కోసం బిడ్డింగ్ వేయలేదు. అప్పుడు చోటు చేసుకున్న అనుభవాలను కేకేఆర్ మాజీ డైరెక్టర్ జాయ్ భట్టాచార్య తాజాగా ఓ కార్యక్రమంలో వెల్లడించారు. గంగూలీ అభిమానుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైనట్లు భట్టాచార్య తెలిపారు. కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే ఫ్రాంచైజీ యజమాని షారుక్ ఖాన్‌కు 400 మెసేజ్‌లు వచ్చాయని భట్టాచార్య తెలిపారు. సాల్ట్‌లేక్‌లో ఉన్న మా నాన్న ఇంట్లో నా అడ్రస్ బోర్డును తొలగించాలేమోనన్న పరిస్థితి తలెత్తిందని భట్టాచార్య వివరించారు. నాడు గంగూలీని తమతో అట్టిపెట్టుకోకూడదనే నిర్ణయం షారుక్‌దేనని తెలిపారు.

## శుభ్‌మన్ గిల్ ఆల్‌టైమ్ రికార్డు

ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. స్వదేశంలో ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో గిల్ అదరగొడుతున్నాడు. తొలి వన్డేలో 87, రెండో వన్డేలో 60 పరుగులు చేసిన ఈ బ్యాటర్ అహ్మదాబాద్‌లో జరుగుతున్న మూడో వన్డేలో (112, 102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతక్కొట్టాడు. ఈ ఇన్నింగ్స్‌తో వన్డేల్లో గిల్ అద్భుతమైన రికార్డు తన పేరిట లిఖించుకున్నాడు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా (50 ఇన్నింగ్స్‌లు) 2500 పరుగులు చేసిన బ్యాటర్ గా రికార్డుల్లోకెక్కాడు. అంతకుముందు ఈ రికార్డు సౌతాఫ్రికా మాజీ ఆటగాడు హషీమ్ ఆమ్లా (53 ఇన్నింగ్స్‌లు) పేరిట ఉండేది. అంతేకాదు ఈ ఫార్మాట్‌లో భారత్ తరఫున వేగంగా 2500 రన్స్ చేసిన శ్రేయస్ అయ్యర్ (59 ఇన్నింగ్స్‌లు) రికార్డును బ్రేక్ చేశాడు.

### ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్ 2

ఇంగ్లాండ్‌తో మూడో వన్డే ఆరంభానికి ముందు ఐసీసీ ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ (773 పాయింట్లు)ను వెనక్కినెట్టి గిల్ (781 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచాడు. పాక్ బ్యాటర్ బాబర్ అజామ్ (786 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లీ రెండు స్థానాలు దిగజారి ఆరో స్థానానికి పడిపోయాడు. శ్రేయస్ అయ్యర్ ఒక స్థానం మెరుగై పదో ర్యాంకు దక్కించుకున్నాడు.

## ఛాంపియన్స్ ట్రోఫీకి కొత్త కెప్టెన్..

### ఐదు మార్పులతో ఆస్ట్రేలియా స్క్వాడ్

వన్డే ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముంగిట ఆ జట్టుకు గాయాలతో పాటు అనివార్య కారణాలు ఇబ్బంది పెడుతున్నాయి. ఏకంగా ఐదు మార్పులతో ఛాంపియన్స్ ట్రోఫీ కోసం స్క్వాడ్‌ను ప్రకటించాల్సి వచ్చింది. స్టీవ్ స్మిత్ సారథ్యంలో ఆస్ట్రేలియా బరిలోకి దిగనుంది. రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్, పేసర్ జోష్ హేజిల్‌వుడ్, ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ గాయాలతో వైదొలిగారు. తొలుత జట్టులో స్థానం దక్కించుకున్న మార్కస్ స్టాయినిస్ వన్డేలకు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. మళ్లీ షాక్ ఇస్తూ మిచెల్ స్టార్క్ కూడా ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి పక్కకు వైదొలిగాడు. శ్రీలంకతో రెండు వన్డేల సిరీస్‌కూ అందుబాటులో ఉండటం లేదని స్టార్క్ వెల్లడించాడు. అతడు ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడనేది తెలియరావడం లేదు. స్టార్క్ నిర్ణయాన్ని గౌరవిస్తామని చెబుతూ ఐదు మార్పులతో ఆసీస్ జట్టును మేనేజ్‌మెంట్ ప్రకటించింది. "మిచెల్ స్టార్క్ పరిస్థితిని అర్థం చేసుకున్నాం. అతడి నిర్ణయాన్ని గౌరవిస్తాం. అంతర్జాతీయ క్రికెట్ పట్ల చూపించే అతడి నిబద్ధత అద్భుతం. ఆస్ట్రేలియాను ఎన్నో మ్యాచుల్లో గెలిపించాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో అతడు లేకపోవడం మాకు నష్టమే. కానీ, టోర్నీలో నిరూపించుకోవడానికి మరొక పేసర్‌కు ఇదొక మంచి అవకాశం"




అని చీఫ్ సెలక్టర్ జార్జ్ బెయిలీ వెల్లడించారు.

**ఆసీస్ స్క్వాడ్ :** స్టీవ్ స్మిత్ (కెప్టెన్), సీన్ అబాట్, అలెక్స్ కేరీ, బెన్ డ్వారిషూస్, నాథన్ ఎల్లిస్, జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, ఆరోన్ హార్డీ, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, స్పెన్సన్ జాన్సన్, మార్నస్ లబుషేన్, గ్లెన్ మాక్స్‌వెల్, తన్వీర్ సంఘా, మాథ్యూ షార్ట్, ఆడమ్ జంపా. ట్రావెల్ రిజర్వ్: కూపర్ కొనొల్లీ

## అతడు నెంబర్ వన్ బౌలర్..

### సిరాజ్‌ను పక్కనపెట్టడంపై నెట్టింట విమర్శలు

భారత స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. వెన్ను నొప్పి నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అతడికి మేనేజ్‌మెంట్ విశ్రాంతి ఇచ్చింది. బుమ్రా స్థానంలో యువ పేసర్ హర్షిత్ రాణాకు అవకాశం దక్కింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు బదులు వరుణ్ చక్రవర్తిని మేనేజ్‌మెంట్ స్క్వాడ్‌లోకి తీసుకుంది. ఇక్కడే సిరాజ్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. సిరాజ్‌ను ప్రధాన స్క్వాడ్‌లోకి కాకుండా.. నాన్ ట్రావెల్ రిజర్వ్‌గా ఎంపిక చేసింది. సీనియర్ పేసర్‌ను పక్కనపెట్టడం సరైంది కాదనే భావనను వ్యక్తంచేశారు. బుమ్రా తర్వాత 2022 నుంచి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఉన్న సిరాజ్‌ను ఎంపిక చేయలేదని.. 2023 జనవరిలో వన్డే టాప్ బౌలర్‌గా నిలిచాడని అభిమానులు గుర్తు చేశారు. "బుమ్రా లేడు. షమీ ఇంకా పూర్తిస్థాయిలో ఫామ్ అందుకోలేదు. కుర్రాడిగా ఉన్న హర్షిత్ రాణాను పరీక్షించడం అవసరమా? సిరాజ్‌కు ఎందుకు అవకాశం ఇవ్వలేదు? మ్యాచ్ విన్నర్ అయిన సిరాజ్‌కు జట్టులో స్థానం లేకుండా చేయడం అత్యంత దారుణం" "భారత ప్రధాన కోచ్ ఏకపక్షంగా, స్వార్థంతో నిర్ణయాలు తీసుకుంటున్నట్లుంది. అతడు కేవలం



కేకేఆర్ ప్లేయర్లను మాత్రమే జట్టులోకి ఎంపిక చేస్తాడేమో. సిరాజ్‌ను కాదని హర్షిత్‌ను తీసుకోవడం, యశస్వి స్థానంలో వరుణ్‌ను ఎంపిక చేయడం చూస్తే అదే నిజమనిపిస్తోంది. భారత క్రికెట్‌లో ఇలాంటివి చోటుచేసుకోవడం బాధాకరం" "జట్టులో ఐదుగురు స్పిన్నర్లా? కొంచెమైనా ఆలోచించలేదా? ఒక స్పిన్నర్‌కు బదులు సిరాజ్‌ను తీసుకోవాల్సింది. యశస్వి జైస్వాల్‌ను కూడా పక్కనపెట్టారు. సుందర్ స్థానంలో యశస్విని ఉంచితే బాగుండేది"

# భారతీయులంతా చూడాల్సిన చిత్రమిది..

## ఎమర్జెన్సీపై మృణాల్ పోస్ట్

కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఎమర్జెన్సీ'. ఎన్నో వాయిదాల అనంతరం జనవరి 17న ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా ఈ సినిమాను వీక్షించినట్లు హీరోయిన్ మృణాల్ ఠాకూర్ పోస్ట్ పెట్టారు. కంగనా రనౌత్‌పై ప్రశంసలు కురిపించారు. నటిగా కంగనా సినీ కెరీర్ గురించి ప్రస్తావించారు. "మా నాన్నతో కలిసి 'ఎమర్జెన్సీ' చూశాను. ఆ సినిమా అందించిన అనుభూతి నుంచి ఇంకా బయటకు రాలేకపోతున్నా. కంగనా అభిమానిగా ఈ సినిమాను బిగ్‌స్క్రీన్‌పై చూడడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది ఆమెకు అద్భుతమైన విజయం. 'గ్యాంగ్‌స్టర్' నుంచి 'క్వీన్' వరకు.. 'తను వెడ్స్ మను' నుంచి 'మణికర్ణిక', 'తలైవి' వరకు.. ఇప్పుడు తాజాగా 'ఎమర్జెన్సీ' ఇలా నిరంతరం ఆమె నటనలో సరిహద్దులు దాటుతూ అద్భుతమైన ప్రతిభతో ఎంతోమందిలో స్ఫూర్తి నింపుతున్నారు. ఈ సినిమాలోని ప్రతి అంశం నన్ను ఆకట్టుకుంది. కెమెరా యాంగిల్స్, కాస్ట్యూమ్స్.. ఇలా ప్రతిదీ నన్ను ఆకర్షించాయి. ఈ చిత్రంతో కంగనా దర్శకురాలిగానూ ఇండస్ట్రీలో చెరగని ముద్ర వేశారు. స్క్రీన్‌ప్లే, మాటలు, సంగీతం, ఎడిటింగ్ అన్నీ బాగున్నాయి" అని అన్నారు. "కంగనాతో పాటు నటీనటులంతా అద్భుతంగా నటించారు. ఆమె కేవలం నటి మాత్రమే కాదు.. నిజమైన కళాకారిణి. సవాలుతో కూడిన పాత్రలు పోషించడంలో ఆమె ధైర్యం ప్రశంసనీయం. సినిమాపై మీకున్న అంకితభావం ప్రతి ఫ్రేమ్‌లోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఎవరైనా ఈ సినిమాను చూడకపోతే కచ్చితంగా చూడండి. భారతీయులంతా తప్పక చూడాల్సిన చిత్రమిది. ఈ సినిమా చూశాక భావోద్వేగంతో థియేటర్ నుంచి బయటకు వస్తారని నేను హామీ ఇస్తున్నా" అని మృణాల్ పేర్కొన్నారు.



# శారీ టీజర్ విడుదల




టాలీవుడ్ విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ లేటెస్ట్ మూవీ 'శారీ'. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో,ఆర్జీవి-ఆర్వి ప్రొడక్షన్స్ పై ప్రముఖ వ్యాపారవేత్త రవి శంకర్ వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ మూవీని పలు నిజజీవిత సంఘటనల ఆధారాలతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది.కాగా ఈ చిత్రం పాన్ ఇండియా మూవీగా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఫిబ్రవరి 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో భాగంగా తాజాగా ఈ రోజు 'శారీ' సినిమాకు సంబంధించిన ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్ ఉహించని విధంగా చాలా త్రిల్లింగ్ గా ఉంది. అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి బాగా చూపించారు.కొంత భయంగా కూడా ఉంది. ఇక దర్శక, నిర్మాత రామ్ గోపాల్ వర్మ 'సోషల్ మీడియాలో ఎవరెవరు ముక్కు మొహం తెలియని వాళ్ళతో పరిచయం పెంచుకుని, వాళ్ళ బ్యాక్ గ్రౌండ్ గాని, ఫోర్ గ్రౌండ్ గాని, ఏమి తెలియకుండా నమ్మేయడంతో, ఎదురయ్యే ప్రమాదాలు, భయంకర సంఘటనలు, మనం చాలా చాలా విన్నాం! చూసాం! ఇలాంటి నిజ జీవిత ఘటన ఆధారంగా తీసిన సినిమా ఈ 'శారీ' మూవీ' చెప్పారు. ఇక నిర్మాత రవిశంకర్ వర్మ మాట్లాడుతూ 'మా 'శారీ' చిత్రంలోని టీజర్, 'ఐ వాంట్ లవ్' అండ్ 'ఎగిరే గువ్వలాగా?' అనే రెండు లిరికల్ సాంగ్స్ విడుదల చేసాము. వాటికి సోషల్ మీడియాలో విశేష స్పందన లభించింది. ఈ రోజు ట్రైలర్ మాంగో మీడియా ద్వార తెలుగు, హిందీ, తమిళ, మరియు మళయాళ భాషల్లో విడుదల చేసాము.సినిమా ఈ నెల 28న అన్ని భాషల్లో థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నాం తప్పక చూడండి' అంటూ తెలిపారు.



# మళ్లీ రాజకీయాల్లోకి వచ్చే ఛాన్స్ లేదు : చిరంజీవి

ఇటీవల మెగాస్టార్ చిరంజీవి తరచూ రాజకీయ వేదికలపై కనిపిస్తున్నారు. ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్‌లో తదితర విషయాల్లో చిరంజీవి చురుగ్గా ఉండడంతో మళ్లీ ఆయన రాజకీయం వైపు అడుగేస్తారేమో అనుమానం వ్యక్తమవుతున్న తరుణంలో చిరంజీవి స్పందించారు. ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. అనుమానాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. జీవితాంతం కళామతల్లి సేవలోనే ఉంటానని చిరంజీవి స్పష్టం చేశారు. సినీరంగానికి సేవలు, ఇతర సేవా కార్యక్రమాల కోసమే రాజకీయ పెద్దలను కలుస్తున్నానని ఆయన చెప్పారు. అంతకు మించి ఏమీ లేదన్నారు. రాజకీయంగా తాను అనుకున్న లక్ష్యాలు, సేవలు నెరవేర్చేందుకు తమ్ముడు పవన్ కల్యాణ్ ఉన్నాడని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన 'బ్రహ్మ ఆనందం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి చిరంజీవి అతిథిగా హాజరై ఈ వ్యాఖ్యలు చేశారు. 'జీవితాంతం రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాలకు అతి దగ్గరగా ఉంటా. 'పెద్ద పెద్ద వారిని కలుస్తున్నాడు. ఏంటీ? అటువైపు ఏమైనా వెళ్తాడా?' అని కొందరు సందేహపడుతున్నారు. అలాంటి డౌట్స్ పెట్టుకోవద్దు. కళామతల్లి సేవలోనే ఉంటాను' అని అన్నారు. బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ తాత మనవళ్లుగా నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం' . ప్రియ వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఛావా ప్రీరిలీజ్ వేడుకల్లో రష్మిక

## అల్లు అర్జున్‌తో నా ఎనర్జీ సరిపోతుందని వ్యాఖ్య



ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతోంది రష్మిక. తెలుగుతో పాటు బాలీవుడ్‌లోనూ సినిమాలను చేస్తూ తీరిక లేకుండా గడుపుతోంది. విక్కీ కౌశల్ కీలక పాత్రలో లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో రూపొందిన హిస్టారికల్ ఎపిక్ యాక్షన్ ఫిల్మ్ 'ఛావా' రష్మిక కథానాయిక. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా రష్మిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇటీవల కాలంలో ఆమెతో కలిసి నటించిన హీరోల గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'గొప్ప కథల్లో భాగమవడం నాకెంతో ఇష్టం. ఆ సినిమాను ప్రేక్షకులు చూసి, దాని గురించి మాట్లాడుతుంటే, మరింత సంతోషంగా ఉంటుంది. అలాంటి కథల్లోనే నటించాలనుకుంటా. నేను తెరపై కనిపించినంతసేపు ప్రేక్షకుల దృష్టి నాపై ఉండేలా చేయగలను. అదే సమయంలో ఆ సన్నివేశంలో ఎవరు నటిస్తున్నారన్న విషయాన్ని పట్టించుకోను' అని చెప్పుకొచ్చింది. తన సహ నటుల గురించి మాట్లాడుతూ వారిపై ప్రశంసలు కురిపించింది. విక్కీ కౌశల్, అల్లు అర్జున్, రణ్‌బీర్ కపూర్‌లతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా అనిపించిందని తెలిపింది. 'ఇటీవల నేను చేసిన సినిమాల్లోని కో-స్టార్స్ అందరూ ఎంతో మంచి వ్యక్తులు. స్నేహభావంతో, ఎదుటి వారికి ఇబ్బంది కలగకుండా వ్యవహరిస్తారు. ముఖ్యంగా అల్లు అర్జున్ సర్‌తో నా ఎనర్జీ పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతుంది. ఆయనతో నటించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది' అంటూ తెలిపింది రష్మిక.



# అలా చేయడం కరెక్ట్ కాదు..

## సాయిదుర్గా తేజ్



తన పొలిటికల్ ఎంట్రీపై నటుడు సాయి దుర్గా తేజ్ స్పందించారు. భవిష్యత్తు గురించి తనకు ఎలాంటి ప్లానింగ్స్ లేవని అన్నారు. ఆళ్లగడ్డలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో ఈ విషయాన్ని తెలియజేశారు. "నేను ఈ క్షణంలో బతికే మనిషిని. రేపు ఏం జరుగుతుందనే విషయాన్ని పెద్దగా పట్టించుకోను. మరుసటి క్షణం ఏం జరుగుతుందో కూడా మనం చెప్పలేం. ప్రస్తుతానికి నేను ఈ పూటకు నా కడుపు నిండిందా, లేదా? నలుగురికి సాయం చేశానా, లేదా? అనేది మాత్రమే చూస్తా. రాజకీయం అనేది చాలా పెద్ద విషయం. అందులో ఎంతో నేర్చుకోవాలి. అది అంత సులభం కాదు. నాకేదో సినిమాల్లో ఫాలోయింగ్ ఉందని రాజకీయాల్లోకి రావడం కరెక్ట్ కాదు. ఎంతో నేర్చుకోవాలి. ప్రజల సమస్యలు తెలుసుకోవాలి. దయచేసి నన్ను సినిమా నుంచి దూరం చేయకండి" అని తెలిపారు.


# నన్ను, నా సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దు

## విష్వక్‌సేన్ పోస్ట్

'లైలా' ప్రీరిలీజ్ వేడుకలో నటుడు పృథ్వీ చేసిన రాజకీయ వ్యాఖ్యలు నెట్టింట చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దీనిపై విష్వక్ సేన్, చిత్ర నిర్మాత సాహు గారపాటి ఇప్పటికే క్షమాపణలు చెప్పారు. అయినా 'లైలా'కు వ్యతిరేకంగా ఎక్స్ వేదికగా పోస్ట్‌లు మాత్రం ఆగడం లేదు. తాజాగా దీనిపై విష్వక్‌సేన్ మరోసారి స్పందించారు. తనను, తన సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దంటూ పోస్ట్ పెట్టారు. నేడు విడుదల కానున్న ఈ సినిమా పాట పోస్టర్‌లను విష్వక్ సేన్ షేర్ చేశారు. "నా సినిమాకు సంబంధించిన ప్రతి పోస్టర్.. నా సినిమాకు సంబంధించింది మాత్రమే. సినిమాల పోస్టర్స్, పోస్ట్‌లను షేర్ చేసే ప్రతిసారీ రెండు సార్లు ఆలోచించలేను. ఈ ఫొటోలో ఉంది సోనూ మోడల్.. ఫిబ్రవరి 14న మీ ముందుకు వస్తున్నాడు" అని అన్నారు. ఇక ఎక్స్‌లో ట్రెండ్ అవుతోన్న బాయ్‌కాట్ లైలా హ్యాష్‌ట్యాగ్ గురించి మాట్లాడుతూ.. " నేను ప్రతిసారీ తగ్గను. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో జరిగిన దానికి నిన్న మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పాను. అతిగా ఆలోచించొద్దు. ప్రశాంతంగా ఉండండి. మళ్లీ చెబుతున్నాను.. నేను నటుడిని మాత్రమే. నన్ను, నా సినిమాను రాజకీయాల్లోకి లాగొద్దు" అని విష్వక్‌సేన్ చెప్పారు. విష్వక్‌సేన్ హీరోగా దర్శకుడు రామ్‌నారాయణ్ తెరకెక్కించిన చిత్రమే 'లైలా'. ఆకాంక్ష శర్మ హీరోయిన్. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ఇటీవల నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో.. తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ విశేషాలు చెబుతూ 150 మేకల్లో చివరకు 11 మిగిలాయని నటుడు పృథ్వీరాజ్ చెప్పడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ సినిమాని బాయ్‌కాట్ చేయాలంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ మొదలైంది. ఈ హ్యాష్‌ట్యాగ్‌తో ఇప్పటివరకూ లక్షా 50వేలకు పైగా పోస్ట్‌లు షేర్ అయ్యాయి.



# బాలీవుడ్‌పై వర్మ కీలక వ్యాఖ్యలు



చిత్ర పరిశ్రమలో సౌత్ వర్సెస్ నార్త్ డిబేట్ ఎంతోకాలం నుంచి కొనసా గుతోన్న విషయం తెలిసిందే. ఇప్పటి కే ఎన్నోసార్లు ఈ టాపిక్‌పై మాట్లాడిన ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తాజాగా మరోసారి తన అభిప్రాయాలు పంచుకున్నారు. సినిమా మేకింగ్, ప్రేక్షకుల అభిరుచుల్లో ఎన్నో మార్పులు వచ్చాయని తా జాగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ లో తెలిపారు. తీయగలిగే సామర్థ్యం ఉన్నా కూడా 'పుష్ప 2' వంటి చిత్రాలను బాలీవుడ్ ఫిల్మ్‌మేకర్స్ రూపొందించలేకపోతున్నారని అన్నారు. "పుష్ప 2' వంటి చిత్రాలను తెరకె క్కించడానికి బాలీవుడ్ ఫిల్మ్‌మేకర్స్‌కు ఆ సామర్థ్యం లేక కాదు. కానీ, వారు ఆవిధంగా ఏమాత్రం ఆలోచించడం లేదు. దక్షిణాది, ఉత్తరాది.. ప్రేక్షకులు ఎక్కడైనా ఒక్కటే. సినిమాలే వారి మధ్య వ్యత్యాసం తీసుకువస్తాయి. అమితాబ్ బచ్చన్ హీరోగా రాణిస్తోన్న రోజుల్లో దక్షిణాది వారు హిందీ చిత్రాలను రీమేక్ చేసేవాళ్లు. సౌత్‌లో ఉన్న ఆనాటి అగ్రహీరోలందరూ రీమేక్ చిత్రాల్లో నటించినవారే. సినిమాకు సంబంధించిన ఎన్నో విశేషాలను హిందీ చిత్ర పరిశ్రమ నుంచే దక్షిణాది వారు నేర్చుకున్నారు" "కొంతకాలానికి మ్యూజిక్ కంపెనీలు వెలిశాయి. సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాయి. తమ సంస్థను ప్రమోట్ చేయడం కోసం సినిమాల్లోకి పాటలను తీసుకువ చ్చాయి. అదే సమయంలో అమితాబ్ సుమారు ఐదేళ్లు విరా మం తీసుకున్నారు. దాంతో చిత్ర పరిశ్రమ మ్యూజికల్ మూవీస్ వైపు మొగ్గింది. 'మైనే ప్యార్ కియా', 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' వంటి సినిమాలు పుట్టుకొచ్చా యి. ఇటీవల కొత్తతరం దర్శకులు వచ్చారు. బాంద్రా వంటి ఖరీదైన ప్రాంతాల్లో నివసిస్తూ.. విదేశీ చిత్రాలపై ఆసక్తి చూపిస్తున్నారు. అదేతరహా చిత్రాలను రూపొంది స్తున్నారు. ఆవిధంగా బాలీవుడ్ నెమ్మదిగా తమ మేకింగ్ స్టైల్ మర్చిపోయింది. మాస్ ఎంటర్‌టైనర్స్‌ను తెరకెక్కిం చడం మానేసింది. కానీ, సౌత్ పరిశ్రమలో ఎలాంటి మార్పు రాలేదు. ఇక్కడి వారు తమ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణమైన చిత్రాలు రూపొందిస్తూనే ఉన్నారు. మాస్ ఆడియన్స్‌ను అలరిస్తున్నారు" అని వర్మ చెప్పారు.

# అస్సలు ఊహించలేదు

## 'దబిడి దిబిడి' కాంట్రవర్సీపై ఊర్వశీ రౌతేలా

'డాకు మహారాజ్'లో అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణతో కలిసి నటించారు బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా. ఇందులో బాలయ్యతో కలిసి ఆమె 'దబిడి దిబిడి' పాటకు డ్యాన్స్ చేశారు. ఈ పాట విడుదలైన సమయంలో కొరియోగ్రఫీపై వచ్చిన కాంట్రవర్సీ గురించి తాజాగా ఊర్వశీ రౌతేలా స్పందించారు. ప్రేక్షకుల నుంచి ఈవిధమైన స్పందన తాను అస్సలు ఊహించలేదని అన్నారు. ఆ పాట, అందులోని స్టెప్పులను ప్రేక్షకులు ఆదరిస్తారనుకున్నానని ఆమె చెప్పారు. కానీ, ఈవిధంగా మాట్లాడతారని తాను అస్సలు అనుకోలేదని తెలిపారు. "రిహార్సల్స్ అంతా ప్రశాంతంగా జరిగింది. అన్ని పాటలకు ఏవిధంగా కొరియోగ్రఫీ ఉంటుందో అదేవిధంగా ఈ పాటకూ చేశాం. శేఖర్ మాస్టర్ ఈ పాటకు డ్యాన్స్ కొరియోగ్రఫీ చేశారు. ఇప్పటికే నాలుగుసార్లు ఆయనతో కలిసి వర్క్ చేశాను. ఆయన స్టెప్పులు చెప్పినప్పుడు నాకు ఏమాత్రం విభిన్నంగా లేదా అభ్యంతరకరంగా అనిపించలేదు. సాధారణమైన స్టెప్పుల మాదిరిగానే భావించా. కానీ, పాట విడుదలయ్యాక సోషల్‌మీడియాలో వచ్చిన విమర్శలు చూసి షాకయ్యా. కొరియోగ్రఫీని ప్రేక్షకులు తప్పుపట్టడానికి కారణం ఏమిటో అంచనా వేయడానికి కూడా సమయం లేకపోయింది. అంతా సడెన్‌గా జరిగిపోయింది. రిహార్సల్స్ చేస్తున్నప్పుడు ఇలాంటి విమర్శలు వస్తాయని మేము అస్సలు ఊహించలేదు. రిహార్సల్స్ క్లిప్స్ విడుదల చేసినప్పుడు ఎలాంటి విమర్శలు రాలేదు" అని ఊర్వశీ రౌతేలా తెలిపారు. ఏదేమైనా సోషల్‌మీడియా వేదికగా కొంతమంది కావాలని చేసే వ్యాఖ్యలను తాను పట్టించుకోనని అన్నారు. వివరణాత్మక విమర్శలను తాను స్వాగతిస్తానని చెప్పారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463